
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



కృష్ణా జిల్లా వార్తలు


మంగళవారం 24 డిసెంబరు 2024



సీఎం చంద్రబాబుకు కేక్ తినిపిస్తున్న మతపెద్ద

- ఘనంగా ప్రీ క్రిస్మస్ సెలబ్రేషన్స్

శాంతి మార్గంలో



- క్రిస్మస్ కేకు కట్ చేసిన సీఎం చంద్రబాబు
- కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తుకు ఘన నివాళి
- క్రైస్తవ మత పెద్దలతో కలిసి ప్రేమ విందు స్వీకరణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): క్రీస్తు త్యాగాలను స్మరించుకుంటూ శాంతి మార్గాన్ని అనుసరిద్దామని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సోమవారం ఏ ప్లస్ కన్వెన్షన్‌లో ప్రీ క్రిస్మస్ సెలబ్రేషన్స్ - 2024 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ప్రేమ, కరుణ, సేవకు ప్రతీక క్రైస్తవమన్నారు. ప్రతి ఒక్కరూ ప్రేమ తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈర్ష్యా ద్వేషాలను వీడాలని కోరారు. అబద్ధం, అవినీతి వంటి వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. 'భగవంతుడు నిన్ను ఎప్పుడూ ఖాళీగా వదిలిపెట్టడు. నీవు కోల్పోయిన ప్రతి ఒక్కదానిని తిరిగి నీకిస్తాడు. ఆటుపోట్లను ఎదుర్కొన్నప్పుడు నిన్ను మళ్లీ పైకి తీసుకువచ్చేందుకు సహాయం అందిస్తాడు' అని చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల పట్ల దయ, ధర్మాన్ని నమ్మిన వారికి దేవుడు ఎల్లప్పుడూ అండగా ఉంటాడన్నారు.

సేవా కార్యక్రమాలకు స్ఫూర్తి

స్వాతంత్ర్య రాకముందు నుంచి క్రైస్తవ మిషనరీ సంస్థలు కాలేజీలు, హాస్పిటల్స్ కట్టి పేదలకు సేవ చేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలకు స్ఫూర్తి ఇచ్చింది ఏసు ప్రభువేనన్నారు. లోక రక్షకుడైన ప్రభువు కరుణ, కటాక్షాలు ఉండాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. మైనారిటీ సోదరులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసం, చెడు మళ్లీ జరకుండా చర్యలు తీసుకుంటున్నానన్నారు. పేదరికం లేని సమాజం కోసం తాను ఆలోచనలు చేస్తున్నానని, విజన్ - 2047లో నిర్దేశించుకున్న ప్రధాన లక్ష్యమిదేనన్నారు. క్రైస్తవులకు మెరుగైన సంక్షేమం, ఆర్థిక సహాయ సహకారాలు అందించింది తెలుగుదేశం ప్రభుత్వమేనన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవ సోదరులందరికీ ఈ సందర్భంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రిస్మస్ కేకును కట్ చేసి క్రైస్తవ మత పెద్దలకు తినిపించారు. క్రైస్తవ మతపెద్దలు కూడా చంద్రబాబుకు కేకు తినిపించారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించారు. ప్రేమ విందుకు హాజరయ్యారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామమోహన్, యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు.



గుడివాడ మండలం కొత్త చౌటపల్లిలోని మల్లాయిపాలెం గ్రామ రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్, చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర, గుడవాడ ఎమ్మెల్యే రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, కలెక్టర్ బాలాజీ తదితరులు

చేతివాటం చూపించిన కేటుగాళ్లు

గొడవర్రు గ్రామంలో జరిగిన పవన్ పర్యటనలో కేటుగాళ్లు చేతివాటం చూపించారు. కంకిపాడు గ్రామానికి చెందిన తిరుపతిరావు అనే వ్యక్తి రెల్లి కులస్తులకు ఎస్సీ సర్టిఫికెట్ ఇప్పించాలంటూ పవన్ వద్దకు వచ్చారు. ఈ సమయంలో ఆయన జేబులో ఉన్న సుమారు రూ.18 వేలు దొంగతనానికి గురయ్యాయి. అలాగే, ఓ రిపోర్టర్ జేబులోని సుమారు రూ.3 వేలతో పాటు మరో రిపోర్టర్ మనీపర్సు కూడా మాయమైంది.

అభివృద్ధి దారిలో..

- కంకిపాడులో డిప్యూటీ సీఎం పవన్ పనితీరుపై హర్షం
- అక్టోబరు 14న పల్లె పండుగకు హాజరు
- కంకిపాడు-రొయ్యూరు రహదారి పనులకు ఆదేశాలు
- అక్కడితో వదిలేయకుండా ఎప్పటికప్పుడు ఆరా
- రెండు నెలల్లో మళ్లీ అభివృద్ధి పనుల పరిశీలన
- తాజాగా సంక్రాంతికి పూర్తికావాలని ఆదేశాలు



నాడు : అక్టోబరు 14న కంకిపాడులో పల్లె పండుగ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఈ సమయంలో కంకిపాడు-రొయ్యూరు వయా గొడవర్రు రహదారి పరిస్థితి దయనీయంగా ఉందంటూ స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన అక్కడి నుంచే అభివృద్ధి పనులు చేపట్టాలంటూ సంబంధిత అధికారులను ఆరోజే ఆదేశించారు.

నేడు : కేవలం ఆదేశాలు జారీచేసి ఊరుకోలేదు. పనుల పురోగతి పరిశీలించేందుకు రెండు నెలల వ్యవధిలో సోమవారం మళ్లీ కంకిపాడుకు పవన్ కల్యాణ్ రావడంపై స్థానికుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం పరిశీలనతోనే సరిపెట్టక.. గోసాల గ్రామ పరిధిలో రహదారి ఎన్ని మీటర్ల వెడల్పు ఉండాలి, ఎన్ని అంగుళాలు ఎత్తు ఉండాలన్నది పవన్ నేరుగా టేపుతో కొలిచి కొలతలు వేశారు. కాల్వలో పెట్టిన పైపులు ఎన్ని అంగుళాలు ఉన్నాయంటూ కాల్వలో చెయ్యి పెట్టి మరీ కొలిచిన తీరును స్థానికులు ప్రశంసిస్తున్నారు.

-కంకిపాడు-ఆంధ్రజ్యోతి

సంక్రాంతి నాటికి పూర్తిచేయండి

కంకిపాడు-రొయ్యూరు వయా గొడవర్రు రహదారి అభివృద్ధి పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. కంకిపాడు మండలంలోని గొడవర్రు గ్రామంలో రూ.3.75 కోట్లతో జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులను, పెనమలూరు మండలం గోసాల గ్రామ పరిధిలో రూ.33 లక్షలతో చేపట్టిన రహదారి, డ్రెయినేజీ అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. మంగళగిరి నుంచి రోడ్డు మార్గాన గొడవర్రుకు చేరుకున్న ఆయన రహదారి నాణ్యతను పరిశీలించారు. రహదారి ఎప్పటికి పూర్తవుతుందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం

ఢిల్లీకి చేరిన వెస్ట్ బైపాస్

- ముదురుతున్న ల్యాంకో టవర్ల మార్పిడి వివాదం
- ప్రధాని, కేంద్రమంత్రి గడ్కరీ, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌లకు రైతుల ఫిర్యాదు
- లైసెన్స్ లేని కంపెనీతో పనులపై కేంద్రం సీరియస్
- విచారణకు కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖకు ఆదేశాలు
- ఎన్‌హెచ్ విజయవాడ ఆర్వో ఆఫీసు అధికారులపై గడ్కరీ కన్నెర్ర
- తక్షణం వివరణ ఇవ్వాలంటూ లేఖ
- ఎన్‌హెచ్ ఉన్నతాధికారుల వివరణ కోరిన సెంట్రల్ విజిలెన్స్ కమిషన్
- మరోవైపు హైకోర్టు సీరియస్.. 13 కేసులపై 11 స్టేలు
- ఇప్పటికే సమగ్ర విచారణకు సీఎం చంద్రబాబు ఆదేశాలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు వెంబడి ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడి వివాదం ఢిల్లీకి చేరింది. జక్కంపూడి, నైనవరానికి చెందిన రైతులు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ప్రధానికి ఆన్‌లైన్ గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా.. సాక్ష్యాధారాలు సహా ఫిర్యాదు చేశారు. వెంటనే ప్రధాని కార్యాలయం నుంచి రైతులకు సమాధానం కూడా అందింది. ఈ అంశంపై ఫాలో అప్ చేస్తామని రిప్లై వచ్చింది. అంతేకాదు.. విచారణ జరపాలని కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖకు ఆదేశాలు కూడా అందాయి. రైతుల ఫిర్యాదు అందుకున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కూడా స్పందించారు. జాతీయ రహదారుల సంస్థ విజయవాడ ఆర్వో కార్యాలయ ఉన్నతాధికారులపై సీరియస్ అయ్యారు. తక్షణం వివరణ కోరారు. కాగా, రైతులు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు చేయటంతో ఆ సంస్థ కూడా స్పందించింది. దీనిపై కేంద్ర జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులను వివరణ కోరింది. ఎన్‌హెచ్ ఉన్నతాధికారులు విజయవాడ ఆర్వో కార్యాలయ అధికారులను వివరణ కోరారు. ఒకేసారి ప్రధాన మంత్రి కార్యాలయం, నితిన్ గడ్కరీ కార్యాలయం, సెంట్రల్ విజిలెన్స్ కార్యాలయాలు స్పందించటంతో విజయవాడ వెస్ట్ బైపాస్ ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ల అంశం సంచలనంగా మారింది. అయితే, ఇన్నాళ్లూ రైతులను అక్రమంగా అరెస్టులు చేయిస్తూ పనులు చేపట్టిన సంస్థలన్నీ సైలెంట్ అయ్యాయి. తవ్విన గోతులను రాత్రికి రాత్రే పూడ్చేశాయి. కాగా, తమకు జరుగుతున్న అన్యాయాన్ని జక్కంపూడి, నైనవరం రైతులు ఇటీవల సీఎం చంద్రబాబును కలిసి వివరించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వీరిని సీఎం వద్దకు తీసుకెళ్లారు. దీనికి

నాన్ ఇంటర్ లాకింగ్ పనులు

26 రైళ్లురద్దు.. 21 డైవర్షన్ 6లో

పుస్తకాల పండుగకు ముస్తాబు 8లో





క్యూలైన్లో భవానీలు

అరుణమయం

భవానీల రాకతో ఎరుపెక్కిన ఇంద్రకీలాద్రి

వన్‌టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ ఉత్సవాలు సోమవారం మూడో రోజు కూడా ఘనంగా జరిగాయి. సుదూర ప్రాంతాల నుంచి భవానీలు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఉత్సవాల ముగింపు ఉండటంతో తండోపతండాలుగా వస్తున్నారు. రైళ్లు, బస్సులతో పాటు కాలినడకన వస్తున్న భవానీలతో ఇంద్రకీలాద్రి అరుణవర్ణాన్ని పులుముకుంది. కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భవానీలు గిరిప్రదక్షిణ చేసి దుర్గమ్మ దర్శనానికి వెళ్తున్నారు. అనంతరం దీక్షను విరమిస్తున్నారు. కాగా, రద్దీని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటున్నారు.

పీడీఎస్ బియ్యం మాయం కేసులో విచారణ వేగవంతం

- జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు
- నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు

మచిలీపట్నం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో పీడీఎస్ బియ్యం మాయం కేసులో దర్యాప్తు ను వేగవంతంగా చేసినట్లు ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. కంకిపాడులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీడీఎస్ బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి పేర్ని నానికి నోటీసులు జారీ చేశామని, ఆయన నోటీసులు చూడకపోతే మళ్లీ ఇస్తామని చెప్పారు. ఈ కేసు విచారణపై ఎవ్వరూ ఎలాంటి అపోహలుపడవద్దని, నిష్పక్షపాతంగా దర్యాప్తు సాగుతుందని తెలిపారు. ఈ కేసులో ఇరువురిపై కేసు నమోదు చేశామని, ఒకరు యాంటిసిపేటరీ బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారన్నారు. దీనికి పోలీస్ విభాగం తరఫున కౌంటర్ దాఖలు చేసినట్లు తెలిపారు. మానస తేజ అనే వ్యక్తి గోడౌన్‌కు మేనేజర్‌గా ఉన్నారని, అతని ఆచూకీ కోసం గాలింపు చేపట్టామన్నారు. త్వరితగతిన ఈ కేసును విచారణ చేస్తున్నామని తెలిపారు. ఈ కేసులో నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయని వివరించారు.

సముద్రతీరంలో బుసక దందా!

- ప్రత్యేక కమిటీలుగా ఏర్పడి మరీ అక్రమ రవాణా
- ముడా భూముల్లోనూ జోరుగా తవ్వకాలు
- మంగినపూడి గ్రామ పరిధిలోని సాల్ట్ భూములనూ వదల్లేదు!
- ట్రాక్టర్ బుసక రూ.1200 నుంచి రూ.1500 వరకు విక్రయం
- పట్టించుకోని అధికారులు.. విమర్శలు గుప్పిస్తున్న ప్రజలు

“ మచిలీపట్నం మండలంలోని సముద్రతీర గ్రామాల్లో బుసకదందా జోరుగా సాగుతోంది. గతంలో రాత్రి వేళే గుట్టుగా సాగే ఈ వ్యవహారం ఇటీవల పగలు, రాత్రి అనే తేడా లేకుండా సాగిపోతోంది. శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో దోపిడీని అక్రమార్కులు మరింత తీవ్రం చేస్తున్నారు. ట్రాక్టర్ బుసక రూ.1200 నుంచి రూ.1500 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో బందరు పోర్టు నిర్మాణం కోసం రైతులు మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి(ముడా)కి విక్రయించిన భూముల్లో బుసకను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. ముడాలో పనిచేసే కొంత మంది సర్వేయర్లు, సిబ్బంది రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన భూములను దగ్గరుండి మరీ చూపి ప్రోత్సహిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. -ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం

కరగ్రహారం నుంచి నిత్యం బుసక రవాణా!

కరగ్రహారం, కరగ్రహారం పల్లెపాలెం గ్రామాల వెంబడి సముద్రతీరంలోని వందలాది ఎకరాల బే ఆఫ్ బెంగాల్ భూముల్లో సముద్రపు ఒడ్డున మేటవేసిన బుసక గుట్టలున్నాయి. ఈ రెండు గ్రామాల్లో బుసక దందాను కొనసాగించే అన్నిపార్టీలకు చెందిన నాయకులు ప్రత్యేక కమిటీగా ఏర్పడ్డారు. ప్రభుత్వ భూముల నుంచి ఇటీవల కాలంలో బుసకను తవ్వేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ బుసకను రూ.1200 నుంచి 1500లకు విక్రయిస్తున్నారు. బయటి వ్యక్తుల ట్రాక్టర్లు తమ గ్రామాల్లోకి బుసక రవాణా నిమిత్తం రాకూడదనే ఆంక్షలు పెట్టి మరీ ఇక్కడి నుంచి బుసకను తవ్వి విక్రయిస్తున్నారు. రెవెన్యూ అధికారులకు పూర్తిస్థాయి వివరాలు తెలిసినా ఎవ్వరూ ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇటీవల కాలంలో జనసేనకు చెందిన కొందరు కార్యకర్తలు ఈ బుసక దందాను అడ్డుకునేందుకు ప్రయత్నించినా కమిటీ సభ్యులు వారి ప్రయత్నాలను సాగనివ్వలేదు.

మంగినపూడి సాల్ట్ భూముల నుంచి యథేచ్ఛగా తవ్వకాలు

మంగినపూడి గ్రామం పరిధిలో 150 ఎకరాల సాల్ట్ భూములున్నాయి. ఈ భూములు శిరివేళ్లపాలెం గ్రామ పంచాయతీకి సమీపంలో ఉన్నాయి. గతంలో ఈ భూముల్లో ఉప్పును పండించే వారు. కొంతకాలంగా గిట్టుబాటు కావడంలేదని, ఇతరత్రా కారణాలతో ఇక్కడ ఉప్పు ఉత్పత్తిని నిలిపివేశారు. ఈ భూములు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. శిరివేళ్లపాలేనికి చెందిన ఒక ప్రజాప్రతినిధి బంధువు, ఆయన అనుచరుల నేతృత్వంలో బుసక తవ్వకాలను కొద్దిరోజుల కిందట ప్రారంభించి జోరుగా కొనసాగిస్తున్నారు. సాల్ట్ భూములు కేంద్రప్రభుత్వం ఆధీనంలో ఉండటంతో వాటిలో తవ్వకాలు జరిపేందుకు ఇప్పటివరకు ఎవ్వరూ సాహసించలేదు. గోపువాని పాలెం, మంగినపూడి, కరగ్రహారం గ్రామాల్లో ప్రభుత్వ భూముల నుంచి బుసక తవ్వకాలు చేస్తున్నా అధికారులు అంతగా పట్టించుకోకపోవడంతో ఇక ఏకంగా సాల్ట్ భూముల నుంచి బుసకను తరలించి ఒక్కో ట్రాక్టరును 1500 విక్రయిస్తున్నారు. దీనిపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఇటీవల బుసక తవ్వకాలను అడ్డుకున్నారు. అయినా అక్రమార్కులు ఇక్కడి నుంచి బుసకను తరలిస్తూనే ఉన్నారు.



మంగినపూడి సాల్ట్ భూముల్లో బుసక తవ్వకాలు

పోర్టు భూముల్లోనూ విధ్వంసం

మచిలీపట్నం పోర్టు నిర్మాణం కోసం ప్రభుత్వం గోపువానిపాలెం, మంగినపూడి గ్రామాల్లోని ప్రభుత్వ భూములు 2,200 ఎకరాలను కేటాయించింది. పోర్టు పనులు జరుగుతున్న ప్రాంతానికి కొద్ది దూరంలో గత కొన్నిరోజులుగా పగలు, రాత్రి తేడా లేకుండా బుసక తవ్వకాలు చేస్తున్నారు. మచిలీపట్నం పోర్టుకు కొండరాళ్లను తీసుకువచ్చే టిప్పర్‌లు తిరుగు ప్రయాణంలో ఖాళీగా వెళ్లకుండా, వాటిలో బుసకను నింపి ఇతరప్రాంతాలకు తరలించేస్తున్నారు. ఇంతా జరుగుతున్నా పోర్టు అధికారులు, రెవెన్యూ అధికారులు ఈ అంశాన్ని చూసీ చూడనట్లుగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


చల్లగ చూడు తల్లీ..



భక్తి పారవశ్యంతో..

మూడోరోజు దుర్గమ్మను దర్శించుకున్న 63,500 మంది భక్తులు

వన్‌టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై భవానీదీక్షల విరమణల మూడో రోజైన సోమవారం సాయంత్రం వరకు 63,500 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 15 వేల మందికి దేవస్థానం అన్న ప్రసాద వితరణ చేసింది. ఉదయం అల్పాహారం 5000 మందికి, సాయంత్రం కదంబం, ఉప్మా 8,000 మందికి అందజేశారు. సాయంత్రం 6 గంటల వరకు 13,700 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. సాయంత్రం వరకు 3,50,450 లడ్డు ప్రసాదాలను విక్రయించారు. కనకదుర్గమ్మవారి దర్శనం వేకువజామున 3 నుంచి రాత్రి 11 గంటలవరకు కొనసాగుతోంది. ఎటువంటి ఇబ్బందులు లేకపోవడంతో దర్శనాల పట్ల భక్త జనం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివిధ సమాచారం అందించే యాప్ పట్ల భక్తులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఫలితంగా భక్తులు ఆయా సేవలను సులభంగా పొందగలుగుతున్నారు. 7 లక్షల మంచినీరు బాటిళ్లు దేవస్థానం సిద్ధం చేసింది.




కొండపై భక్తజన సందోహం


దీక్ష విరమణ


హోమగుండం


తలనీలాలు సమర్పిస్తూ..


జల్లు స్నానాలు చేస్తూ..

పేర్ని నాని అరెస్టు తప్పదు

» ఇంట్లో మహిళల్ని రోడ్డుకిడ్చిన విధానం సిగ్గుచేటు

» మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ



మచిలీపట్నం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పేదల బియ్యం మాయం కేసులో తప్పించుకు తిరుగుతున్న పేర్ని నానిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం మునిసిపల్ పార్కు వద్ద ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణతో కలిసి మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. సొంత గోదాములో బియ్యం మాయమైతే తెలియదని పేర్ని నాని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తప్పు చేయకపోతే ఎందుకు తప్పించుకుతిరుతున్నారో సమాధానం చెప్పాలన్నారు. గోదాములో బియ్యం మాయంపై పూర్తి విచారణ జరిపిస్తామని, దోషులు అందరినీ శిక్షించి తీరతామన్నారు. అడగకుండానే రూ. 1.70 కోట్లు ప్రభుత్వానికి ఎందుకు చెల్లించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా గుట్టు బయటపెడతామన్నారు. ఇంట్లో మహిళల్నీ రోడ్డున పడేసిన విధానం చూస్తుంటే సిగ్గేస్తోందన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, పేర్ని నాని గోదాము నిర్మాణమే అవినీతి సొమ్ముతో జరిగిందని, అధికారుల్ని అడ్డంపెట్టుకుని ఉపాధి హామీ నిధుల్ని దుర్వినియోగం చేసి మట్టి తరలించుకున్నారన్నారు. అవినీతికి సహకరించిన అధికారుల్ని కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్నారని, మెడికల్ కాలేజీ పేరుతో చేసిన దోపిడీని కాగ్ నివేదికలో పేర్కొందన్నారు. అధికారం ఉందని అడ్డగోలుగా దోచుకుని ఇప్పుడు తప్పించుకోవాలనుకుంటే కుదరదన్నారు. పేర్ని నాని ఎక్కడ దాక్కున్నా వదిలే ప్రసక్తే లేదన్నారు. దోపిడీలను బట్ట బయలు చేసి ప్రజా కోర్టులో దోషిగా నిలబడెతామన్నారు.


సీఎం రిలీఫ్ ఫండ్ అందజేస్తున్న కేశినేని చిన్ని, కోట వీరబాబుకు సత్కారం, సీఎల్ఆర్‌పీ పోస్టుల్లో తీసుకోవాలని ఎంపీ శివనాథ్‌ను కోరుతున్న రిసోర్స్ పర్సన్లు

క్లస్టర్ లెవల్ రిసోర్స్ పర్సన్లుగా తీసుకోండి

» ఎంపీ శివనాథ్‌కు రిసోర్స్ పర్సన్ల వినతి

వన్‌టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తమను క్లస్టర్ లెవల్ రిసోర్స్ పర్సన్లుగా తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ యూసీడీ విభాగంలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్లు సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిసి విన్నవించారు. ఈమేరకు ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. విజయవాడలో కొత్తగా నియమకాలు చేస్తున్న వారిలో తమను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతామని ఎంపీ హామీ ఇచ్చినట్టు చెప్పారు.

● నాగార్జున సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన కోట వీరబాబు సోమవారం ఎంపీ శివనాథ్‌ను ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. చందర్లపాడు మండల అధ్యక్షుడు మేకల సుధాకర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

● తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం మండలం గుళ్లపూడికి చెందిన లగడపాటి జనార్దనరావుకు ఇటీవల గుండె ఆపరేషన్ జరిగింది. ఆయన అభ్యర్థన మేరకు రూ.1,46,075 చెక్కును ఎంపీ శివనాథ్ బాధితుడి కుమారుడు హరిప్రసాద్‌కు అందజేశారు.

● రాష్ట్ర ఐటీడీపీ అధ్యక్షుడు చింతకాయల విజయ్, ప్రధాన కార్యదర్శి దేవభక్తుని శివకృష్ణ,ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ల కృష్ణ, కృష్ణాజిల్లా ఐటీడీపీ అధ్యక్షుడు ఉప్పల పాటి ప్రవీణ్, రాష్ట్ర కార్యదర్శి తుమ్మల చైతన్య తదితరులు ఎంపీని మర్యాద పూర్వకంగా కలిసారు.

దుర్గగుడి వైదిక కమిటీ నియామకం

వన్‌టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో విశిష్ట పర్వదినాలలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు వైదిక కమిటీని నియమిస్తూ ఈవో రామారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్థానాచార్యుడు వి.శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకుడు ఎల్.దుర్గాప్రసాద్, కేఎస్ వీడీఎం ప్రసాద్, బి.శంకర శాండిల్య, ఎం.షణ్ముఖశాస్త్రి,ఆర్.శ్రీనివాస శాస్త్రి, యూవీఎస్ మురళీధర శాస్త్రి, పీవీ రఘునాథశర్మ, వి.శ్రీధర్ శర్మ, ఓ. రమేష్‌బాబులను కమిటీ సభ్యులుగా నియమించారు.

వ్యర్థాల నిర్వహణపై మహారాష్ట్ర, గుజరాత్‌లలో అధ్యయనం

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో స్వచ్ఛ భారత్ మిషన్ ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేసేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నడుంబిగించింది. ఆ ప్రాజెక్టులు విజయవంతంగా అమలవుతున్న దేశంలోని పలు ప్రాంతాల్లో కార్పొరేషన్ యంత్రాంగం అధ్యయనం చేపట్టింది. అందులో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాంతో పాటు పలువురు అధికారులు మహారాష్ట్ర, గుజరాత్‌లో పర్యటిస్తున్నారు. ఈ జట్టులో పట్టాభిరాంతో పాటు ఎండీ బీ అనీల్ కుమార్ రెడ్డి, పురపాలక శాఖ కమిషనర్ డి.దశరథరామిరెడ్డి, డీఈఈ సతీశ్ కుమార్ తదితరులు ఉన్నారు. ఈ నెల 17న ప్రారంభమైన అధ్యయన యాత్ర 24 వరకు ముంబై, సూరత్, వడోదరలో కొనసాగుతుంది. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై ఈ బృందం అధ్యయనం చేస్తుంది.

అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టండి

» 'మీకోసం'లో నోడల్ అధికారులకు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం


'మీకోసం'లో సమస్యలు వింటున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలన లక్ష్యంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) 'మీకోసం' ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారంపై నోడల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి పాల్గొన్నారు. తొలుత పీజీఆర్ఎస్ కార్యక్రమానికి సంబంధించి రిసెప్షన్, సమాచార కౌంటర్‌తో పాటు రిజిస్ట్రేషన్, హెల్ప్‌డెస్క్, ఆధార్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి పి.జ్యోతి తదితరులతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

విజయవంతంగా చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు

జిల్లా పంచాయతీ కార్యాలయం అధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ సందర్భంగా ఏర్పాటుచేసిన వర్మీ కంపోస్ట్ విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి గ్రామపంచాయతీ 'చెత్త సంపద సృష్టి కేంద్రం' ద్వారా తయారుచేసిన వర్మీ కంపోస్టు విక్రయాలను పరిశీలించారు. ఈ కేంద్రం ద్వారా కిలో వర్మి కంపోస్ట్ ప్యాకెట్ రూ.20కు అందుబాటులో వున్నట్టు అధికారులు వివరించారు. అర కిలో, కిలో, రెండు కిలోల ప్యాకెట్లను అందుబాటులో వుంచినట్టు వివరించారు. మొక్క వేగంగా, ఆరోగ్యవంతంగా పెరిగేందుకు వర్మీ కంపోస్టు ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టిసారించడం జరుగుతోందని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు విజయవంతంగా నడుస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో డీపీవో పి.లావణ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై స్పందించండి

» కృష్ణాజిల్లా జేసీ గీతాంజలిశర్మ


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గీతాంజలిశర్మ

మచిలీపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారవేదిక(మీకోసం) కార్యక్రమంలో వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కృష్ణా జిల్లా జేసీ గీతాంజలిశర్మ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో కలిసి ఆమె ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ, ఈనెల 19 నుంచి 25వరకు కేంద్రప్రభుత్వం ఆదేశాలమేరకు ప్రశావన్ గావ్ సప్తహ్(గుడ్ గవర్నెస్) కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో వివిధ శాఖలద్వారా అమలుచేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన సక్సెస్‌స్టోరీలను ఈనెల 25లోగా అధికారులు సమర్పించాలన్నారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు మాట్లాడుతూ, మండలస్థాయిలోనూ మీకోసం కార్యక్రమం నిర్వహించాలని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్‌లకు సూచించారు. భూవివాదాలకు సంబంధించిన అంశాలపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని, వీటి పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో అధికారులు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈనెల 28న ఉమ్మడికృష్ణాజిల్లాలో 'వన్‌మాన్ కమిషన్ ఆన్ ఎస్సీ సబ్‌క్లాసిఫికేషన్' అంశంపై విజిట్ ఉంటుందని, అన్ని శాఖల అధికారులు నిర్దేశించిన ఫార్మాట్‌లో నివేదికలను సమర్పించాలన్నారు. జాతీయ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా దివ్యాంగురాలికి ఉపాధికోసం రూ.5లక్షల చెక్కును జేసీ అందజేశారు. కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, మెప్మాపీడీ సాయిబాబు, పౌరసరఫరాలశాఖ డీఎం పద్మాదేవి, డీఎస్‌వో పార్వతి వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

● దీర్ఘకాలిక వ్యాధులతో మంచాన ఉన్న దివ్యాంగులకు సంబంధించి ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు రిజిస్ట్రార్లు ఇళ్లవద్దకే వెళ్లి సేవలందించాలని జేసీ గీతాంజలి శర్మకు కృష్ణాజిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ అంశాన్ని పరిశీలించి తక్షణమే సేవలందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

నాన్ ఇంటర్ లాకింగ్ పనులు

26 రైళ్లు రద్దు.. 21 డైవర్షన్

» భవానీ భక్తులకు తప్పని ఇబ్బందులు!



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడకు భవానీలు పోటెత్తుతున్న నేపథ్యంలో, మరోవైపు రైల్వే అధికారులు ముందస్తు ఆలోచన లేకుండా భారీ సంఖ్యలో రైళ్లను రద్దుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నగరానికి భవానీలు తరలివస్తున్న సమయంలో రైల్వే అధికారులు నాన్ ఇంటర్‌లాక్ పనులు చేపట్టారు. అర్థంతరంగా పనులు చేపట్టడం వల్ల భవానీలకు ఇబ్బందులు తప్పలేదు. నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా భారీ సంఖ్యలో రైళ్లను రద్దు చేయడంతో విజయవాడకు రాకపోకలు సాగించే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాజీపేట-విజయవాడ సెక్షన్‌లో మోటుమర్రి వద్ద నాన్ ఇంటర్‌లాకింగ్‌పనుల కారణంగా 26 రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది. రెండు రైళ్లను పాక్షికంగా రద్దు చేసింది. మరో 21 రైళ్లను డైవర్షన్ చేసింది.

● డోర్నకల్-విజయవాడ (07755), విజయవాడ డోర్నకల్ (07756), విజయవాడ-భద్రాచలం (07979), భద్రాచలం-విజయవాడ (07278), గుంటూరు-సికింద్రాబాద్ (12705), సికింద్రబాద్-గుంటూరు (1206), విజయవాడ-సికింద్రాబాద్ (12713), సికింద్రాబాద్-విజయవాడ (12714), కొచ్చివేలు-ఇండోర్ (22646), ఇండోర్-కొచ్చువేలు (22645), కొచ్చువేలు-కోర్బా (22648), కోర్బా-కొచ్చువేలు (22647), గోరఖపూర్-కొచ్చువేలు(12511), కొచ్చువేలు-గోరఖ్‌పూర్ (12512), బారౌని-ఎర్నాకుళం(12521), ఎర్నాకుళం-బారౌని (12522), ధన్‌బాద్-కోయంబత్తూరు (03325), కోయంబత్తూరు-ధన్‌బాద్(03326), హిస్సార్-తిరుపతి (04717), తిరుపతి-హిస్సార్ (04718), బెంగళూరు-దానాపూర్ (06509), దానాపూర్-బెంగళూరు(06510)

● గుంటూరు-సికింద్రబాద్ (17201) సికింద్రాబాద్-గుంటూరు (17202) రైళ్లను జనవరి 9 వరకు పాక్షికంగా రద్దు చేశారు.

● విశాఖపట్నం-ముంబాయి, షాలిమార్-హైదరాబాద్, సాయినగర్ షిర్డీ-కాకినాడ పోర్టు, సాయినగర్ షిర్డీ-మచిలీపట్నం, మచిలీపట్నం-సాయినగర్ షిర్డీ, ముంబాయి-భువనేశ్వర్, భువనేశ్వర్-ముంబాయి, షాలిమార్-సికింద్రాబాద్, విశాఖపట్నం-సికింద్రాబాద్, సికింద్రాబాద్-షాలిమార్, హెచ్ నిజాముద్దీన్-కన్యాకుమారి, హెచ్‌నిజాముద్దీన్-త్రివేండ్రం, హెచ్ నిజాముద్దీన్-ఎర్నాకుళం, దానాపూర్-బెంగళూరు, బెంగళూరు-దానాపూర్ రైళ్లను విజయవాడ, గూడూరు, వరంగల్, కాజిపేట స్టేషన్ల మీదుగా వెళ్లటాన్ని తొలగించారు.

అభివృద్ధి దారిలో..

(5వ పేజీ తరువాయి)

గోసాల గ్రామ పరిధిలో రూ.33 లక్షలతో చేపట్టిన రహదారి, డ్రెయినేజీ పనులను పరిశీలించారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జనసేన పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ముప్పా రాజా, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సుబానీ, స్థానిక టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పులి శ్రీనివాసరావు, ఎందువ రాంబాబు, ఏనుగ జయప్రకాష్, వంగూరు పవన్ తదితరులు పాల్గొన్నారు.


కంకిపాడు-రొయ్యూరు రహదారి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్, చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానం

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ స్వర్ణోత్సవాలకు హాజరుకావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఆ సంఘం నేతలు ఆహ్వానించారు. ఆ సంఘం నేతలు ఎన్. వెంకటేశ్వర్లు, ఎం.హనుమంతురావు సోమవారం సచివాలయంలో సీఎంను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. జనవరి 5 నుంచి 8 వరకు కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు యూటీఎఫ్ నేతలు తెలిపారు. అలాగే ఇటీవల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన బొర్రా గోపీమూర్తికి సీఎం అభినందనలు తెలిపారు. యూటీఎఫ్ నేతలతో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఉన్నారు.

స్వచ్ఛమైన నీరు అందించే దిశగా..

» గుడివాడలో డిప్యూటీ సీఎం పవన్

గుడివాడ/గుడివాడ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థలో సమూల మార్పులను తీసుకొచ్చి, గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించేలా చర్యలు తీసుకున్నామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గుడివాడ మండలం కొత్త చౌటపల్లిలోని మల్లాయిపాలెం గ్రామ రక్షిత మంచినీటి పథకాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. తొలుత మల్లాయిపాలెం రక్షిత మంచినీటి పథకం చెరువును పరిశీలించారు. కలెక్టర్ డీకే బాలాజీ.. ఫిల్టర్ బెడ్‌ల పనితీరును పవన్‌కు వివరించారు. ఫిల్టర్ బెడ్‌ల ద్వారా సరఫరా అవుతున్న స్వచ్ఛమైన తాగునీటి నమూనాల ప్రదర్శనను అధికారులతో కలిసి పరిశీలించారు. నీటిశుద్ధి పరీక్షలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎమ్మెల్యే బూరగడ్డ వేదవ్యాస్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ గుడివాడ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి చేరిన వెస్ట్ బైపాస్

(5వ పేజీ తరువాయి)

స్పందించిన సీఎం ఐఏఎస్ అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

అక్రమాలు ఇలా..

ల్యాంకోకు చెందిన ట్రాన్స్‌మిషన్ లైన్‌కు సెంట్రల్ ఎలక్ట్రికల్ రెగ్యులేషన్ కమిటీ నుంచి లైసెన్స్ (164 లైసెన్స్) లేదు. ఈ లైసెన్స్ లేని సంస్థకు చెందిన టవర్ లైన్లను మార్చే అధికారం ఎన్‌హెచ్‌కు కూడా ఉండదు. లైసెన్స్ లేని ఓ ప్రైవేట్ సంస్థ ప్రయోజనాల కోసం టవర్ల మార్పిడి పేరుతో ఎన్‌హెచ్ విజయవాడ ఆర్వో కార్యాలయం అధికారులు రూ.32.58 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ చర్య కేంద్ర ప్రభుత్వానికి నష్టం చేకూరుస్తుంది. మూతపడిన సంస్థ గతంలో ఇచ్చిన ప్రతిపాదనను దృష్టిలో ఉంచుకుని పనులకు టెండర్లు పిలవటంతో ఆ సంస్థకు సూపర్ వైజేషన్ చార్జీల కింద రూ.44 లక్షల మేర చెల్లించారు. ల్యాంకో సంస్థ నుంచి ఒక యూనిట్‌ను కొనుగోలు చేసిన రాధా టీఎంటీ అనే సంస్థ విద్యుత్ అంతరాయం పేరుతో రూ.14 కోట్లను ఎన్‌హెచ్ నుంచి డిమాండ్ చేయటం, ఎన్‌హెచ్ కొంతమేర డబ్బు చెల్లించటం గమనార్హం. వాస్తవానికి రాధా టీఎంటీ కేవలం ప్లాంట్‌లోని ఒక యూనిట్‌ను మాత్రమే కొనింది. ట్రాన్స్‌మిషన్ టవర్ల లైన్‌ను మాత్రం మయన్మార్‌కు చెందిన సంస్థ కొనుగోలు చేసింది.

మయన్మార్ సంస్థ దీనికి బాధ్యత వహించాల్సి ఉంటుంది. రాధా టీఎంటీ అనే సంస్థ ఏ అధికారంతో రూ.14 కోట్లు డిమాండ్ చేసిందో తెలియాలి. ఒకవేళ మయన్మార్ కంపెనీ, రాధా టీఎంటీలు అంతర్గత ఒప్పందం కుదుర్చుకున్నా లైసెన్స్ జారీకి అది చెల్లబాటు కాదు. రెండు టవర్లతో పోయే దానిని 11 టవర్లకు పెంచి రోడ్డుకు 105 మీటర్ల దూరంలో అర్ధచంద్రాకారంగా తిప్పుతూ రైతులను ఇబ్బంది పెడుతున్న అలైన్‌మెంట్ వ్యవహారంలో ఎన్‌హెచ్, రాధా టీఎంటీ, పాత ల్యాంకో యాజమాన్యాల హస్తం ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి.

హైకోర్టు సీరియస్.. 11 స్టేలు విడుదల

మూతపడిన ల్యాంకో పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడి వెనుక భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయని రైతులు హైకోర్టును ఆశ్రయించారు.

మూతపడిన ప్రైవేట్ సంస్థ ప్రయోజనాల కోసం వందలాది మంది రైతులను ఇబ్బందులు పెడుతున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై ఇప్పటికే ఐదు స్టేలు ఇచ్చిన న్యాయస్థానం తాజాగా మరో ఆరు జారీ చేసింది. 13 కేసులకు సంబంధించి ఇప్పటి వరకు 11 స్టేలు వచ్చాయి. ఈ అంశంపై హైకోర్టు సీరియస్‌గా ఉంది. ల్యాంకో లైన్ లైసెన్స్ అంశంపై ప్రభుత్వాన్ని వివరణ కోరింది. తదుపరి విచారణ పూర్తిచేసే వరకు యథాతథ పరిస్థితిని కల్పిస్తూ స్టే ఇచ్చింది. మిగిలిన రెండింటికీ స్టేలు వచ్చే అవకాశం ఉంది.


కృష్ణాతరంగ్ విజేతలైన కేబీఎన్ కాలేజీ విద్యార్థులు

సౌత్ జోన్ పోటీలకు కృష్ణా వర్సిటీ జట్లు

వన్‌టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈనెల 26నుంచి నిర్వహించనున్న దక్షిణ భారత (సౌత్‌జోన్) అంతర్ విశ్వవిద్యాలయాల యువజనోత్సవాలలో పాల్గొననున్న కృష్ణావర్సిటీ జట్టును రెక్టర్ మండవ బసవేశ్వరరావు సోమవారం ప్రకటించారు. కేబీఎన్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 10నుంచి 12 వతేదీ వరకు కళాశాలలో నిర్వహించిన కృష్ణాతరంగ్ పోటీల్లో ప్రతిభచూపిన జట్ల నుంచి సౌత్‌జోన్‌కు ఎంపిక చేసినట్టు తెలిపారు. 58 మందితో జట్టు ఈనెల 25న బయలుదేరి వెళుతుందని తెలిపారు. కళాశాల నుంచి ఏకాంకిక, స్కిట్, మైమ్, పాశ్చాత్యగానం, సోలో బృందగానం జట్లు వెళతాయన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల నుంచి జానపద ఆర్కెస్ట్రా, మెహిందీ, రంగోలి, శాస్త్రీయ సంగీతం సోలో, వాద్యం సోలో, లలిత సంగీతం గాత్రం, బృందగానం, శాస్త్రీయ నృత్య జట్లు వెళతాయని, సిద్ధార్థ మహిళా కళాశాల నుంచి జానపద నృత్యం, ఉపన్యాసం జట్లు, నలంద కళాశాల నుంచి క్విజ్, చర్చ, క్లే మౌల్డింగ్, ప్రత్యక్ష పెయింటింగ్, ఫొటోగ్రఫీ, కార్టూనింగ్, కొలేజ్, పోస్టర్ మేకింగ్, ధ్వన్యనుకరణం, ఇన్‌స్టాలేషన్ జట్లు వెళ్లనున్నట్టు చెప్పారు. రెక్టర్ వెంట కేబీఎన్ ప్రిన్సిపాల్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్స్ పీ ఎల్ రమేష్, కె.రామకృష్ణలు ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఈనెల 10 నుంచి 12వరకు కేబీఎన్ కళాశాలలో నిర్వహించిన కృష్ణాతరంగ్ పోటీలలో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. స్కిట్, మిమిక్రీ, క్లే మౌల్డింగ్, స్పాట్ ఫొటో గ్రఫీ, ఇన్‌స్టాలేషన్, మెహిందీ, ఆన్ స్పాట్ పెయింటింగ్ విభాగాలలో ప్రథమ బహుమతి, మైమ్, పోస్టర్ మేకింగ్, కోలేజ్ విభాగాలలో ద్వితీయ బహుమతి, కార్టూనింగ్ విభాగంలో తృతీయ బహుమతి అందజేశారు.

ట్రైకార్ ఎండీగా సదాభార్గవి

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల సహకార ఆర్థిక సంస్థ(ట్రైకార్) మేనేజింగ్ డైరెక్టర్‌గా గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదా భార్గవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ట్రైకార్ పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ జీఓ నం.171ను ప్రభుత్వం విడుదల చేశారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	100,109, 120
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 590

రైస్ మిల్లుల తనిఖీ

ఉయ్యూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు, యాకమూరు, గండిగుంట పరిధిలో రైస్ మిల్లులను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోనెసంచుల నిల్వలు తెలుసుకుని, నాణ్యత పరిశీలించారు. సంచుల అందుబాటు తదితర అంశాలకు సంబంధించి సమస్యలు రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో హెలా షారోన్, మండల తహసీల్దార్ సురేశ్‌కుమార్ కలెక్టర్‌తో ఉన్నారు.



గోనెసంచులను పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

సీఎం చంద్రబాబు హామీ అమలు

పేద కుటుంబానికి ఆటో అందజేత

పెనమలూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అద్దె ఆటోతో కుటుంబాన్ని పోషించడం కష్టంగా ఉన్న ఒక పేద కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఒక ఎలక్ట్రిక్ ఆటోను అందించి ఆ కుటుంబానికి కొండంత సాయాన్ని అందించింది టీడీపీ కూటమి ప్రభుత్వం వణుకూరుకు చెందిన నువ్వుల సాయికృష్ణ అద్దె ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని భారంగా పోషిస్తున్నాడు. ఒక్కో రోజు అతనికి వచ్చే సంపాదన ఆటో అద్దెకే పోయేది. అయితే గత వారం ముఖ్యమంత్రి చంద్రబాబు పెనమలూరు నియోజకవర్గ పర్యటన సందర్భంగా సాయికృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తన గోడును విన్నవించుకున్నాడు. అద్దె ఆటోతో వచ్చే అరకొర ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకోలేక పోతున్నానని చంద్రబాబు వద్ద వాపోయాడు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు అతనికి ఒక ఎలక్ట్రికల్ ఆటోను ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసి అతని కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రక్కనే ఉన్న కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీను ఆదేశించారు. దీంతో కలెక్టర్ బాలాజీ రోజుల వ్యవధిలోనే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అతనికి ఆటోను ఏర్పాటు చేశారు. సదరు ఆటోను సోమవారం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పోరంకి టీడీపీ కార్యాలయంలో సాయికృష్ణ కుటుంబానికి అందించారు.



సాయికృష్ణ కుటుంబానికి ఆటో తాళాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న తాడిగడప పవన్ బ్యాంకర్స్ ప్రైడ్ అపార్టుమెంట్ వాసులు

సీసీ రోడ్డు నిర్మించాలి

తాడిగడప పద్మజానగర్ కాలనీలోని తమ అపార్టుమెంటు వద్ద సీసీ రోడ్డు నిర్మించాలని పవన్ బ్యాంకర్స్ ప్రైడ్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం ఉన్న తమ కాలనీ రోడ్డు పూర్తిగా ధ్వంసమయిందని, రాళ్లు తేలి ప్రయాణం ఇబ్బందిగా ఉందని, చిన్న పిల్లలు వృద్ధులు రోడ్డుమీద ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాకాలం తమ రోడ్డు పరిస్థితి దారుణంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ రోడ్డు ద్వారా రోజూ వందల మంది చుట్టుప్రక్కల ఉన్న అపార్టుమెంటు వాసులు ప్రయాణిస్తుంటారని, అత్యంత ప్రాముఖ్యత ఉన్న తమ కాలనీ రోడ్డును త్వరగా నిర్మింపజేసి తమను ఆదుకోవాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అపార్టుమెంటు వాసులు రవిశంకర్, శ్రీకుమార్, సంజయ్, పార్థసారథి, విష్ణు, మోహన్‌రావు తదితరులు ఉన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శేషగిరిరావు

కిశోర వికాసంపై శిక్షణ

ఉయ్యూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కిశోర వికాసంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.బేబీ సుకన్య, ఉయ్యూరు ఎంపీడీవో శేషగిరిరావు, పాల్గొని బాల్యవివాహాల నిషేధ చట్టం, బాల్య వివాహాలు చేసేవారికి శిక్షలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబి సరోజిని, పీహెచ్‌సీ వైద్యురాలు ఇంద్రా వతి, ఎంఈవో సుధారాణి, నాగరాజు తదితరలు అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, టీచర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

26 నుంచి టైలరింగ్‌లో..

ఉయ్యూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నేక్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈ నెల 26 నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేశ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వయస్సు వారు శిక్షణకు అర్హులని, శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు అందిస్తామని తెలిపారు. వివరాలకు 9392345939, 7660968899 సెల్ నంబర్లకు ఫోన్‌చేసి పూర్తివివరాలు తెలుసు కోవచ్చని పేర్కొన్నారు.



విద్యార్థినికి నగదు ప్రోత్సాహం అందజేస్తున్న మాజీ సర్పంచ్ సూరిబాబు

విద్యార్థినికి నగదు ప్రోత్సాహం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని మాజీ సర్పంచ్ ఆర్నేపల్లి సూరిబాబు విద్యార్థులకు సూచించారు. వీరవల్లి హైస్కూల్‌కు చెందిన ఆర్నేపల్లి చంద్రిక నేషనల్ షూటింగ్‌బాల్ పోటీలకు అర్హత సాధించినందుకు స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ మంజూరు చేసిన నగదు ప్రోత్సాహకాన్ని సోమవారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కోడూరుపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండపల్లి వెంకన్న, శ్రీనివాసరావు, గండి అచ్చియ్య, ఆర్నేపల్లి వెంకటేశ్వరరావు, కరణం రవి, ఉపాధ్యాయులు కృష్ణారావు, రమణగోపాల్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్ అన్నారు. కానుమోలులో సోమవారం ప్రణవ్ పుట్టినరోజు సందర్భంగా స్కూల్ ఆవరణలో ఆయనతో కలిసి మొక్కలు నాటారు. యువతకు స్ఫూర్తి నిచ్చేందుకు, విద్యార్థి దశ నుంచి పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు సొసైటీ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ చేసి పరిరక్షణ బాధ్యత కూడా అప్పగించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబల తరుణ్, వార హరీష్ పాల్గొన్నారు.



చీరలు అందజేస్తున్న తిరివీధి వెంకయ్య

వృద్ధులకు చీరలు పంపిణీ

గన్నవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రాయనగర్‌లో సోమవారం బార్ అసోసి యేషన్ మాజీ అధ్యక్షుడు తిరివీధి వెంకయ్య ఆధ్వర్యంలో 100 మంది వృద్ధులకు, వితంతువులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ, పేదలకు సేవ చేయటంలో ఎంతో సంతృప్తి కలుగుతుందన్నారు. ప్రతి ఏటా క్రీస్తు మార్గాన్ని అనుసరిస్తూ తనవంతు వృద్ధులకు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తిరివీధి రాణి, జున్ను నారాయణ, ఓలేటి శాంతికుమార్, రాచేటి రూతుమ్మ తదితరులు పాల్గొన్నారు.

అరటి తోటల పరిశీలన

కంకిపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సకాలంలో ఎరువులు వినియోగించి వివిధ తెగుళ్ల నుంచి రైతులు ఉపశమనం పొందవచ్చు అని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వి. మంజువాణి అన్నారు. మండలంలోని మద్దూరు, కాసరనేని వారి పాలెం గ్రామంలో సోమవారం ఆమె అరటి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరటిలో సిగతోక ఆకుమచ్చ తెగులు అధికంగా ఉందన్నారు. వీటి నివారణకు రైతులు తీసుకోవాల్సిన చర్యలను ఆమె వివరించారు.



టీడీపీ నేతకు ఎమ్మెల్యే యార్లగడ్డ పరామర్శ

గన్నవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్తాబాద గ్రామ పార్టీ అధ్యక్షుడు పాలడుగు మల్లికార్జునరావు ద్విచక్ర వాహనంపై వస్తూ స్కిడ్ అయి పడ్డారు. గాయాలయ్యి ఇంటి వద్ద ఉంటున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదివారం రాత్రి వెళ్లి పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగింది అని తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు మేడేపల్లి కాంతారావు, గుంటూరు ప్రసాద్, గరిమెళ్ల కృష్ణార్జునరావు, మేడేపల్లి సురేష్, పాలడుగు రత్నావరావు, పాటిబండ్ల కిరణ్‌కుమార్, షేక్ అబుల్యాజ్, పలగాని కళ్యాణ్ చక్రవర్తి, కోనేరు రమామణి, మేడేపల్లి రమ తదితరులు ఆయన వెంట ఉన్నారు.



డాక్టర్ ప్రణయ్‌సాగర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

వీరవల్లిలో హెల్త్ అసిస్టెంట్ల నిరసన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : వైద్య, ఆరోగ్య శాఖలో ఉద్యోగాలు కోల్పోయిన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ హెల్త్ అసిస్టెంట్లు నిరసన కార్యక్రమం చేశారు. వీరవల్లి పీహెచ్‌సీ ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించి డాక్టర్ ప్రణయ్‌సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు వైద్య సేవలందించడంతో పాటు కరోనా లాంటి విపత్కర సమయాల్లో కూడా ప్రజలకు ప్రాణాలకు రక్షణగా నిలచామన్నారు. తమ సేవలను గుర్తించి కోర్టు ఉత్తర్వులను అనుసరించి తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పండు, గుండుగొలను నాగరాజు, కందుకూరి వేణుగోపాలాచారి, శివాజీ, తదితరులతో పాటు మహిళా సిబ్బంది పాల్గొని సంఘీభావం తెలిపారు.

విద్యార్థులు లక్ష్య సాధన అలవరుచుకోవాలి



గన్నవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్య సాధనను అలవరుచుకోవాలని సీఐ బివి శివప్రసాద్ అన్నారు. స్థానిక వీఎస్ సెయింట్ జాన్స్ ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీఐ శివప్రసాద్ మాట్లాడుతూ, పిల్లలను మొబైల్‌కు బానిసలుగా మార్చవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్ కుమార్, ఎస్సై శివ ప్రసాద్, సీనియర్ బ్రదర్ జిమ్మి కురియాకోస్, బల్లా జోసఫ్, జయబాలన్, ఏకాంబరి తదితరులు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఏసు క్రీస్తు మార్గంలో నడవాలి

ప్రసాదంపాడు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో షోలోమ్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు సమాజానికి మంచిని ప్రబోధించారని, దీనుల కోసం ఆయన రక్తాన్ని ధారపోశారని అన్నారు. క్రీస్తు మార్గంలో మానవుడు నడవాలని ఆకాంక్షించారు. అనంతరం టీజీఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరుపున నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షోలోమ్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ నిర్వాహకులు, టీడీపీ రూరల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో..



గన్నవరం : మండలంలోని ముస్తాబాద నవభారత్ హైస్కూల్ లో సోమవారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. బ్రదర్ జాన్‌పాల్ మాట్లాడుతూ, క్రీస్తుమార్గం అందరికీ అనుచరణీయమన్నారు. యేసు క్రీస్తు పుట్టుకతో లోకానికి వెలుగు వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన బాటలో నడిచి ఎదుటి వారి పట్ల ప్రేమ, జాలి, దయ, కరుణ చూపా లన్నారు. ప్రిన్సిపాల్ షేక్ ఇమామ్, జాకీరా సుల్తానా, అశోక్ రాణి, హసీనా, సునీతా, విజయలక్ష్మీ, జయ శ్రీ, కౌసర్ పాల్గొన్నారు.



గండిగుంట దత్తాశ్రమంలో వ్రతంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా అనఘాష్టమి వ్రతం

గన్నవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసరపల్లి శివారులోని గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి పంచతత్వ గురుపాదుకా ఆశ్రమం నందు నిత్య దత్తాత్రేయ రుద్రహోమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. 108 మంది దంపతులతో సామూహిక అనఘాష్టమి వ్రతం నిర్వహించారు. ప్రతి ఏడాది మార్గశిర మాస కృష్ణపక్ష బహుళ అష్టమి రోజున చేసే ఈ వ్రతం చాలా ప్రసిద్ధిమైనదని అర్చకులు ప్రవీణ్ దత్తా, శ్రీపాద దత్త తెలిపారు. తుమ్మల ఉపేంద్ర ఆర్థిక సహాయంతో నిత్యా అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గండిగుంట దత్తాశ్రమంలో ..

ఉయ్యూరు : గండిగుంట శ్రీగణపతి సచిదానంద జ్ఞానబోధ సభ ఆవరణలో సోమవారం పురాణ ప్రసిద్ధి చెందిన ప్రధాన అనఘాష్టమివ్రతం, శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 కలశాలతో భక్తులు పూజలు, అభిషేకాలు చేశారు. గండిగుంట, ఉయ్యూరు పరిస ప్రాంతాల నుంచి భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం 300 మంది భక్తులకు అన్నసమా రాధన చేశారు. మేనేజింగ్ ట్రస్టీ మంజుల, కమిటీ సభ్యులు పాల్గొని సేవలందించారు.

జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు హర్షిత

గన్నవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దావాజీ గూడెం జడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని మద్దూరి హర్షిత పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చక్కటి ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. విజయ వాడలో 68వ స్కూల్ గేమ్స్ పవర్ లిఫ్టింగ్ క్రీడాపోటీల్లో పాల్గొన్న హర్షిత అండర్-17 బాలికల విభాగంలో 84 కేజీలపైన బరువు ఎత్తి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన హర్షితకు బంగారు పతకాన్ని అందజేశారు. హెచ్‌ఎం సునీత, పీడీలు విజయకుమారి, చంద్రశేఖర్ హర్షితను అభినందించారు.



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య

దాతల సాయంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

కంకిపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దాతల సహకారంతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య అన్నారు. జంపాన వెంకటరత్నం రాఘవయ్య చారిటబుల్ ట్రస్టు సహకారంతో సోమవారం ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు 150 మందికి భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా హాజరైన ధనయ్య మాట్లాడుతూ, దాతల అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు చలసాని రాధాకృష్ణమూర్తి, కొణతం సుబ్రహ్మణ్యం, పడవల మధుసూదనరావు, కొండవీటి శివయ్య, శనగశెట్టి హరికృష్ణ, శనగశెట్టి ప్రసాద్, జంపాన వీరాస్వామి, పాపారావు, దాతలు అమర జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి రైతు సాయం వెలకట్టలేనిది

ఉయ్యూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి పంటలు పండించి సమాజానికి అన్నం పెడుతున్న రైతు సాయం వెలకట్టలేనిదని వ్యవసాయ శాఖ గన్నవరం అసిస్టెంట్ డైరెక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. జాతీయ రైతు దినోత్సవం పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పలువురు రైతులను ఘనంగా సత్కరించారు. లయన్స్ జిల్లా క్యాబినెట్ అదనపు కార్యదర్శి ఆర్. సుధాకర్, ఎన్ రాంబాబు, ట్రెజరర్ ప్రసాద్, ప్రతినిధులు బాలకోటి, రాము, కుటుంబరాజు, రామసత్యకిషోర్, కృష్ణప్రసాద్, ఎంకె బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ వ్యవసాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విశ్వనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొని వ్యవసాయం, రైతులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహ కల్పించారు.

మానవత కార్యాలయంలో ..

హనుమాన్‌జంక్షన్ : భారత మాజీ ప్రధాని చరణ్‌సింగ్ రైతాంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరావు అన్నారు. సోమవారం స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా చరణ్ సింగ్ జయంతి వేడుకను మానవత జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అర్చకులు, సిబ్బంది

అభయాంజనేయస్వామి హుండీ లెక్కింపు

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాం జనేయస్వామి దేవస్థానంలో సోమవారం హుండీని లెక్కించారు. గడిచిన 96 రోజులకు గాను హుండీలో రూ.11,49,981లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో కె.శ్రీనివాస్ తెలిపారు. ఏలూరు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వి.సురేష్‌కుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. కార్యక్రమంలో తెలుగు మహిళా విభాగం ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి వడ్డి వాసవి, ఆర్యవైశ్య సంఘ పెద్దలు, అర్చకులు, సేవాబృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి



తహసీల్దార్ విమలకుమారికి సమస్యలు వివరిస్తున్న సీపీఎం నేతలు

ఉంగుటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేయాలని తీర్మానించిన ప్రభుత్వ భూమిని ఏళ్లతరబడి పంచకుండా తాత్సారం చేస్తున్న అధికారుల వైఖరిపై సీపీఎం నేతలు ధ్వజమెత్తారు. దీనిపై స్పష్టమైన సమాధానం చెప్పాలంటూ రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ జాలాది విమలకుమారిని నిలదీశారు. మండలంలోని ఎలుకపాడులో సోమవారం రెవెన్యూ, ఇతర అనుబంధశాఖల ఆధ్వర్యంలో మీభూమి, మీహక్కు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొలిమెట్ల శ్రీరామ్, మండల ఎండోమెంట్ ఆఫీసర్ ఈవీ ప్రసాదరావు, టీడీపీ గ్రామఅధ్యక్షుడు డి.విజయకుమార్, వీఆర్వో ఎస్.రామారావు, గ్రామసర్వేయర్లు, గ్రామస్థులు ఎం.కనకరాజు, ఎస్.దావీదు. పులిశ్రీనివాసరావు పాల్గొన్నారు.

లింగ వివక్షను విడనాడాలి

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చిన్న పిల్లలు,స్త్రీల మీద జరుగుతున్న లైంగిక దాడులు, వేధింపులను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా అడ్డుకోవాల్సిన అవసరం ఉందని ఏపీ రైతు సాధికార సంస్థ కృష్ణాజిల్లా మేనేజర్ పార్థసారథి అన్నారు. సోమవారం బాపులపాడు వెలుగు కార్యాలయంలో బాపులపాడు మండల సమైక్య ఆధ్వర్యంలో జాతీయ జెండర్ ఆధారిత హింసపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగొలను, కానుమోలు, వేలేరుహైస్కూల్ విద్యార్థులకు జెండర్ ఆధారిత హింస, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు పార్థసారథి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మండల సమైక్య నాయకురాళ్లు, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



రైల్వేమంత్రి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న జీఎం అరుణ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు

దక్షిణ మధ్య రైల్వేకు ఆలిండియా

పెర్ఫార్మెన్స్ ఎఫిషియన్సీ అవార్డు

- జీఎంకు అందజేసిన రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి జాతీయ గుర్తింపు లభించింది. ఈ విభాగం ప్రదర్శించిన అత్యుత్తమ పనితీరుకు గుర్తింపుగా ఆల్ ఇండియా పెర్ఫార్మెన్స్ ఎఫిషియెన్సీ అవార్డు వరించింది. రైల్వే వారోత్సవాల సందర్భంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ అవార్డు షీల్డ్‌ను దక్షిణమధ్యరైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు అందజేశారు. అలాగే జోన్ పరిధిలోని వివిధ డివిజన్లలో అత్యుత్తమ సేవలందించిన అధికారులు జవ్వాది వెంకట అనూష, వావిలపల్లి రాంబాబు, సుమిత్ శర్మ, ఆంథోనీ దొరైరాజ్, ఆదినారాయణ, కామారపు వినోద్‌లకు అతివిశిష్ట సేవా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సత్య ప్రకాష్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

ఇతర క్రీడలకు న్యాయం చేయాలి

- సీఎం చంద్రబాబుకు కేపీరావు లేఖ

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతిభ చాటే క్రీడాకారులకు ఒలింపిక్ గేమ్స్‌తో సమానంగా ఒలింపికేతర, సంప్రదాయ క్రీడలకు న్యాయం చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్టు ఏపీవోఏ రాష్ట్ర కార్యదర్శి కేపీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో జీవో 74 ప్రకారం క్రీడా కోటా కింద 1500 ఉద్యోగాలిచ్చారని, క్రీడాకారులకు చెల్లించాల్సిన రూ.12 కోట్ల మేర నగదు ప్రోత్సాహకాలు ఇంకా విడుదల చేయలేదన్నారు. క్రీడాకారులకు టీఏ, డీఏలు నూతన క్రీడాపాలసీలో కల్పించలేదన్నారు. ఆడుదాం-ఆంధ్ర టోర్నీపై సీఐడీ విచారణకు ప్రభుత్వం ఆదేశించినా నిజాలు వెలుగులోకి రాలేదన్నారు. అప్పటి ఎండీగా ఉన్న ధ్యాన్‌చంద్ర ఇప్పుడు వీఎంసీ కమిషనర్‌గా ఉన్నారని గుర్తు చేశారు.

ఇవేనా పొదుపు చర్యలు..!

- సొంత వాహనాలకు ఆర్టీసీ డ్రైవర్లను ఉపయోగిస్తున్న అధికారులు
- లైట్ వెయిట్ వాహనాలకు హెవీ వెహికల్ డ్రైవర్లు అవసరమా?
- ఒక పక్క డ్రైవర్ల కొరత.. అద్దె డ్రైవర్లను తెచ్చినా సరిపోని పరిస్థితి!
- సొంత అవసరాలకు దాదాపుగా 400 మంది డ్రైవర్ల వినియోగం
- వీరితో రెండు బస్సు డిపోలను నిర్వహించవచ్చు
- ఆర్టీసీపై అదనపు ఖర్చు.. ప్రయాణికులకు ఎంతో కష్టం



ఒకవైపు డ్రైవర్ల కొరతతో బస్సులు ఆపేస్తున్న పరిస్థితి, మరోవైపు అధికారులు తమ సొంత వాహనాల కోసం ఆర్టీసీ డ్రైవర్లను వాడుకుంటున్న దుస్థితి. ఇది చాలదనట్టు ప్రయాణికులతో నడిపే బస్సులను అద్దె డ్రైవర్లను వినియోగిస్తున్న దౌర్భాగ్యం ఆర్టీసీలో నెలకొంది. ఒకవైపు పొదుపు చర్యలంటూ డ్రైవర్లకు టార్గెట్లు నిర్దేశిస్తూ మరోవైపు ఆర్టీసీ డ్రైవర్ల వినియోగంలో విచ్చలవిడితనం. ఎందుకు..? ప్రాణభయమా.. అధికారులవే ప్రాణాలా..? ప్రయాణికుల ప్రాణాలు నామమాత్రమేనా అంటూ అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విజయవాడ నగరం సహా ఉమ్మడి జిల్లాల్లోని అనేక డిపోల్లో ఇదే పరిస్థితి. - ఆంధ్రజ్యోతి, విజయవాడ.

దాదాపు రెండేళ్లుగా ఆర్టీసీని డ్రైవర్ల కొరత పట్టిపీడిస్తోంది. తొలిసారిగా ఆర్టీసీలో రోజువారీ వేతన ప్రాతిపదికన అద్దె డ్రైవర్లను తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయినా ఇంకా డ్రైవర్ల కొరత పీడిస్తోంది. డ్రైవర్లు లేక సకాలంలో బస్సులను తిప్పలేని పరిస్థితి ఏర్పడితే అధికారులు మాత్రం తమ సొంత వాహనాలకు ఆర్టీసీ డ్రైవర్లను ఎడాపెడా వాడేస్తున్నారు. దాదాపుగా 400 మంది ఆర్టీసీ డ్రైవర్లను ఆర్టీసీ అధికారులు తమ సొంత అవసరాలకు వాడేస్తున్నారు. ఇంత భారీగా ఆర్టీసీ డ్రైవర్లను అధికారులు, ఉన్నతాధికారులు తమ సొంత వాహనాలకు ఉపయోగించడమంటే మామూలు విషయం కాదు. ఈ డ్రైవర్లతో రెండు ఆర్టీసీ బస్సు డిపోలను నిర్వహించవచ్చు. ఆర్టీసీ డ్రైవర్లంటే ఆషామాషీ కాదు. హెవీ వెహికల్ డ్రైవర్లు. ఎంతో సుశిక్షితమైన డ్రైవింగ్ నైపుణ్యాలను కలిగి ఉంటారు. ఇలాంటి వారు బస్సులు నడిపితేనే ప్రయాణికులు సురక్షితంగా ఉంటారు. ఆర్టీసీ సొంత వాహనాలకు లైట్ వెహికల్ డ్రైవర్లు సరిపోతారు. హెడ్డాఫీసు, హెచ్‌వోడీలకైతే ఆర్టీసీ డ్రైవర్లను వినియోగిస్తున్నారంటే అర్థం ఉంటుంది. కానీ జిల్లాస్థాయిలోనూ విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. సీనియర్ స్కేల్ ఆఫీసర్ల (ఎస్ఎస్‌వో)లకు 88 మంది ఆర్టీసీ డ్రైవర్లే వాహనాలను నడుపుతున్నారు. జూనియర్ స్కేల్ ఆఫీసర్లు (జేఎస్‌వో)లకు భారీగా 279 మంది ఆర్టీసీ డ్రైవర్లు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో జీఏడీ వంటి అత్యున్నత శాఖల్లోనే ఉన్నతాధికారుల వాహనాలను సెమీ స్కిల్డ్ డ్రైవర్లే నడుపుతారు. కానీ ఆర్టీసీలో మాత్రం జూనియర్ స్కేల్ అధికారుల వాహనాలను కూడా స్కిల్డ్ డ్రైవర్లే నడుపుతున్నారు. అవుట్‌సోర్సింగ్ విధానంలో డ్రైవర్లను తీసుకునే వీలున్నా ఆ పని చేయటం లేదు.

దీంతో ఆర్టీసీకి ఎంతో నష్టం కలుగుతోంది. ఆర్టీసీ డ్రైవర్లకు రూ.40 వేలు వేతనం ఇవ్వాల్సి ఉంటుంది. అదే అవుట్‌సోర్సింగ్‌లో తీసుకుంటే రూ.20 వేలే. పైగా దీనివల్ల సంస్థపై భారంతో పాటు, ప్రజలకు తగిన సంఖ్యలో బస్సులను అందుబాటులో ఉంచలేకపోతున్నారు. దీనివల్ల విజయవాడ నగరంలో 100 సిటీ బస్సులను నడపలేని పరిస్థితి. గ్రామీణ ప్రాంతాలకైతే చాలా బస్సులను తగ్గించేశారు. ఉన్న డ్రైవర్లను విజయవాడ నుంచి దూర ప్రాంతాలకు ఉపయోగించుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో సర్దుబాటు కాక ఆలస్యంగా నడిపించాల్సి వస్తోంది. ఒక్కోసారి రద్దు కూడా చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్టీసీ అధికారులు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అడ్డగోలుగా నియామకాలు

ఆర్టీసీలో హెచ్‌వోడీ స్థాయి అధికారులకు తప్పితే సంస్థ డ్రైవర్లను ఉపయోగించరాదని గతంలో ఆర్టీసీ ఎండీ సురేంద్రబాబు ఆదేశాలిచ్చారు. కానీ అధికారులు పాటించటం లేదు. జిల్లా స్థాయి అధికారులు కూడా బేఖాతరు చేస్తున్నారు. గతంలో జిల్లాలో రీజనల్ మేనేజర్‌కు మాత్రమే వాహన సదుపాయం ఉండేది. ఇప్పుడు డివిజినల్ మేనేజర్ల స్థాయిలోనూ వాహనాలను ఉపయోగిస్తున్నారు. ఆఖరుకు డిపో మేనేజర్లు కూడా ఉపయోగిస్తున్నారు. సగటున ఒక్కో వాహనానికి ఇద్దరేసి డ్రైవర్లను నియమించుకుంటున్నారు. హెవీ వెహికల్ లైసెన్స్ డ్రైవర్లను బస్సులు నడిపేందుకు ఉపయోగిస్తే ప్రయాణికులకు సురక్షిత ప్రయాణం ఇవ్వటం సాధ్యమవుతోంది. ఆర్టీసీ అధికారుల కార్లను నడిపితే ఏం ప్రయోజనం ఉంటుందో అధికారులకే తెలియాలి.

సంస్థకు భారంగా అధికారుల నిర్ణయాలు

ఆర్టీసీలో ఇంధన పొదుపు పేరుతో డ్రైవర్లకు టార్గెట్లు పెడతారు. ఒక ఎంఎల్ తగ్గించేందుకు నెత్తిన కత్తి పెడతారు. అలాంటిది ఆర్టీసీకి ఇంత భారీ నష్టాన్ని కలిగించేలా వ్యవహరిస్తున్న అధికారుల తీరు మాత్రం మారదు. మరి అధికారులు చేస్తున్న పొదుపు ఏమిటో చెప్పాలి. చేతిలో అధికారం ఉంది కదాని ఇష్టానుసారం ఆర్టీసీ అధికారులు వ్యవహరించటం సరికాదు. దీనివల్ల సంస్థకు భారం, ప్రయాణికులు కష్టం కలుగుతున్నాయి.

పుస్తకాల పండుగకు ముస్తాబు

- 2న విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో పుస్తక మహోత్సవం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ప్రారంభం
- 200 స్టాల్స్‌తో రూపుదిద్దుకోనున్న వేదిక

విజయవాడ కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జనవరి 2 నుంచి పుస్తక పండుగ ప్రారంభం కానుంది. 12 వరకు సాహిత్య, సృజనాత్మకతలకు అంకితమై 36వ పుస్తక మహోత్సవం, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అత్యంత వైభవంగా జరుగనుంది. ఈ ఏడాది పుస్తక మహోత్సవాలు పుస్తకప్రియులకు కొత్తదనాన్ని అందించనుంది. సుమారు 200 స్టాల్స్‌తో అందంగా ముస్తాబైంది. బుక్‌స్టాల్స్‌లో ప్రముఖ పబ్లిషర్స్ తమ పుస్తకాలను ప్రదర్శించనున్నారు. పుస్తకాల ప్రేమికులు తప్పక హాజరుకావాలని ఉత్సవ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు పుస్తక మహోత్సవానికి సంబంధించిన వివరాలను తెలియజేశారు.

ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి

జనవరి 2న సాయంత్రం 5 గంటలకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ మహోత్సవాన్ని ప్రారంభిస్తారు. సాహిత్య అకాడమీ సెక్రటరీ కె.శ్రీనివాసరావు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా హాజరుకానున్నారు. ఈ సందర్భంలో పీవీ నర్సింహారావు జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ జరగనుంది. సాయంత్రం 7 గంటలకు చెరుకూరి రామోజీరావు సంస్మరణ సభ జరుగనుంది. ఈనాడు ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు హాజరుకానున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు మనోహరనాయుడు, కార్యదర్శి లక్ష్మయ్య, బాబ్జీ, గోళ్ల నారాయణరావు తదితరులు

మహోత్సవ ముఖ్య వేదికలు

పిడికిటి రామ కోటేశ్వరరావు ప్రాంగణాన్ని మహోత్సవానికి కేంద్రస్థానంగా తీర్చిదిద్దుతున్నారు. అలాగే చెరుకూరి రామోజీరావు సాహిత్య వేదిక ఏర్పాటు చేయనున్నారు. సాహిత్య ప్రధాన కార్యక్రమాలకు ఇది వేదిక కానుంది. మరోవైపు రతన్ టాటా ప్రతిభా వేదికను విద్యార్థుల కోసం రూపొందిస్తున్నారు. దీనిపై సృజనాత్మకతను ప్రోత్సహించే కార్యక్రమాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. జనవరి 3న సాయంత్రం 6 గంటలకు దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు శత జయంతి సభ, సాయంత్రం 7 గంటలకు జాతీయ కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా ప్రముఖ కవులు పాల్గొంటారు. జనవరి 4న ఆరుద్ర శత జయంతి సభలో ప్రముఖ సాహితీవేత్తలు పాల్గొంటారు. జనవరి 5న జరిగే భానుమతి శత జయంతి సభకు ముఖ్య అతిథిగా రెంటాల జయదేవ పాల్గొంటారు. జనవరి 6న పుస్తక ప్రియుల పాదయాత్ర సిద్ధార్థ కళాశాల నుంచి పుస్తక మహోత్సవం వరకు చేయనున్నారు. ఈ పాదయాత్రలో ప్రతి ఒక్క పుస్తక ప్రియుడు పాల్గొనాలన్నారు. కార్యక్రమాన్ని ఐఏఎస్ అధికారి కె.విజయానంద్ ప్రారంభించనున్నారు. జనవరి 7, 8న నాజర్, ఆలూరి బైరాగి, ఎస్.నటరాజన్ శతజయంతి సభలు జరగనున్నాయి. జనవరి 9న గ్రంథాలయ పునర్వికాసంపై సదస్సు జరగనుంది. మండలి బుద్ధప్రసాద్, మన్నెం రాయుడు, వల్లూరి శివప్రసాద్, దేవినేని మధుసూదనరావు హాజరుకానున్నారు.

విద్యార్థుల కార్యక్రమాలు

రతన్‌టాటా ప్రతిభా వేదిక ఆధ్వర్యంలో ప్రతిరోజు విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వక్తృత్వ పోటీలు (తెలుగు, ఇంగ్లీషు), డ్రాయింగ్, ఒరేగామి, కథ రచన, మిమిక్రీ పోటీలు, క్విజ్, శాస్త్రజ్ఞుల జీవిత చరిత్రలపై ఉపన్యాసాలు, సైన్స్ అండ్ ఫన్ మాథ్స్, మేజిక్ లాజిక్ వంటి అనేక వినోదాత్మక, విద్యాసంబంధిత అంశాలు జరుగుతాయి.

పుస్తక ప్రియులకు ప్రత్యేకం

సాయంత్రం 4-5 గంటల వరకు ప్రతి రోజు 'నన్ను ప్రభావితం చేసిన పుస్తకం' అనే అంశంపై ఓపెన్ డయాస్ ఉంటుందని, ఎవరైనా ముందుగా పేర్లు నమోదు చేసుకొని మాట్లాడవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మనోహర్ నాయుడు, కార్యదర్శి లక్ష్మయ్య, బాబ్జీ, గోళ్ల నారాయణరావు, ఎమ్మెస్కో లక్ష్మి, జేపీ ప్రసాద్ పాల్గొన్నారు.



లోకేష్‌రెడ్డికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డాక్టర్ అరుణకుమారి

బ్రెయిన్ బీ క్విజ్ పోటీల విజేతగా లోకేష్‌రెడ్డి

గుంటూరు మెడికల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు నిర్వహించిన బ్రెయిన్ బీ క్విజ్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఇండియన్ నేషనల్ బ్రెయిన్ బీ సంస్థ సహకారంతో ఆదివారం జరిగిన ఈ క్విజ్ పోటీల్లో గుంటూరు, విజయవాడకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మొదట రాత పరీక్ష ద్వారా, అనంతరం మూడు రౌండ్ల ఓరల్ క్విజ్ పోటీల ద్వారా విజేతలకు ఎంపిక చేశారు. న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణకుమారి ఆధ్వర్యంలో మెదడు జబ్బులైన ఆల్జీమర్స్, ఆస్టిమ్, పక్షవాతంతో పాటు ముసలితనం, నిద్ర, కదలికలు, జ్ఞాపకాలు, భావోద్వేగాలు వంటి పలు అంశాలకు సంబంధించిన ప్రశ్నలు సంధించి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. గుంటూరు భాష్యం జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థి కే లోకేష్ రెడ్డి విన్నర్‌గా నిలిచాడు. ఫస్ట్ రన్నర్‌గా జీ డింపుల్ (సిద్ధార్థ మహిళా జూనియర్ కాలేజీ, విజయవాడ). సెకండ్ రన్నర్‌గా కే సాహితి (కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్, గుంటూరు) నిలిచారు. డాక్టర్ అరుణకుమారి విజేతలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఇండియన్ నేషనల్ బ్రెయిన్ బీ కోఆర్డినేటర్ రవీంద్రనాధ్ మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులను సైన్స్ పట్ల ప్రోత్సహించేందుకు ఏటా ఈ క్విజ్ పోటీలు గుంటూరు జీజీహెచ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇక్కడ విజేతలుగా నిలిచిన వారు రాష్టస్థాయిలో జరిగే బ్రెయిన్‌బీ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు.

విశ్రాంత అధ్యాపకుల సంఘం

నూతన అధ్యక్షుడిగా కృష్ణారావు



మొగల్రాజపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట కళాశాల విశ్రాంత అధ్యాపకుల సంఘం ఎన్నికలు మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగాయి. రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్‌గా జె.గంగాధర్‌రావు (చీరాల), కార్యదర్శిగా జీఆర్‌కే రెడ్డి (విజయవాడ) అసోసియేట్ కార్యదర్శిగా వీవీ రమణ (విజయవాడ), ఫైనాన్స్ కార్యదర్శిగా ఆర్ఎల్ నరసయ్య (కర్నూలు), సలహాదారులుగా ఆర్.వెంకటేశ్వరరెడ్డి, పీవీ లక్ష్మిపతి, లీగల్ సెల్ కన్వీనర్‌గా పీవీ రమణా రెడ్డి, వానప్రస్థ పత్రిక ఎడిటర్‌గా వీ.ఈశ్వరప్రసాద్ ఎన్నికయ్యారని కొత్తగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్‌వీ కృష్ణారావు తెలిపారు.



ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు అందుకుంటున్న స్ఫూర్తి శ్రీనివాస్

స్ఫూర్తి శ్రీనివాస్‌కు ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు

కృష్ణలంక, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'పిచ్చుకను చేసుకొందామా మచ్చిక' అనే నినాదంతో జాతీయ స్థాయిలో చేసిన సేవ్ స్పారో ఉద్యమానికి, 30 ఏళ్లుగా చిత్రకళోపాధ్యాయుడిగా చేస్తున్న సేవలకు గుర్తింపుగా స్ఫూర్తి శ్రీనివాస్‌కు తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు-2024 బహూకరించారు. జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్, శ్రీ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతీయ అవార్డు ప్రధానం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగింది. జాతీయ అవార్డు గ్రహీతగా, ప్రకృతి ప్రేమికుడిగా తన బాధ్యతను పెంచిందని శ్రీనివాస్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూమి వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు

తిరువూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చీరాల సెంటర్‌లో కూల్చివేసిన గ్రామచావిడి స్థలం వద్ద రెవెన్యూ అధికారులు సోమవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రదాన రహదారిలో ఆర్ఎస్‌నెం, 154/2లో 4 సెంట్ల స్థలంలో బ్రిటీషు వారు గ్రామచావిడి (రెవెన్యూ సిబ్బంది కార్యాలయం)ని నిర్మించారు. ఈ కార్యాలయం ద్వారా ప్రజలకు దీర్ఘకాలం సేవలందాయి. ఈనెల 21న కొందరు ప్రైవేటు వ్యక్తులు పగలే భవనం కూల్చివేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. భవనం కూల్చివేసిన విషయం ప్రతికల్లో రావడంతో, హడావిడిగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి చావిడిని కూల్చివేసిన స్థలంలో ఇది ప్రభుత్వ స్థలం అని, ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఒక ఫ్లెక్సీ ఏర్పాటుచేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు పట్టణంలో వినిపిస్తున్నాయి.

వైసీపీకి భారీ షాక్

- పార్టీని వీడిన పలువురు కీలక నేతలు

జి.కొండూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జి.కొండూరు మండలంలో వైసీపీకి మరో భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ కీలక నేతలు సోమవారం రాజీనామా చేశారు. హెచ్.ముత్యాలంపాడు గ్రామానికి చెందిన కాజ సంధ్యారాణి, మాజీ జడ్పీటీసీ కాజ బ్రహ్మయ్య, సున్నంపాడు సర్పంచ్ దేశం సుధాకర్ రెడ్డి, ముగనపాడు సర్పంచ్ పగడాల వెంకటేశ్వరరావు, చెర్వుమాధవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చుండూరు విష్ణువర్ధనరావు, కందులపాడు ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ గార్లపాటి రమాదేవి, ఆమె భర్త గార్లపాటి వెంకట్రావ్, కవులూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గొట్టుముక్కల ఓంకారబాబు, సీనియర్ నేత ఈలప్రోలు వెంకటేశ్వరరావు, జి.కొండూరుకు చెందిన మైలవరం ఏఎంసీ మాజీ డైరెక్టర్ బేతపూడి నిర్మల, బేతపూడి ఏసు తదితరులు వైసీపీ పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు ప్రకటించారు. దీంతో ఒకప్పుడు వైసీపీకి కంచుకోటగా ఉన్న జి.కొండూరు మండలంలో వైసీపీ దాదాపు కనుమరుగయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఆయా గ్రామాల్లో ఎంతో కీలకంగా ఉన్న కాజ బ్రహ్మయ్య, దేశం సుధాకర్ రెడ్డి, జి.ఓంకారబాబు, చుండూరు విష్ణువర్ధనరావు వైసీపీని వీడటం పార్టీకి తీరని నష్టం చేకూర్చే అవకాశం ఉంది. ఇటీవల వైసీపీలో జరుగుతున్న ఒంటెత్తు పోకడలు, కావాలనే కొందర్ని టార్గెట్‌గా చేసుకొని ముఖ్య నేతలు వ్యవహరిస్తున్న తీరుతో విసిగిపోయిన నేతలు పార్టీ వీడారు. వీరు ఏ పార్టీలో చేరేది త్వరలో తెలుస్తుంది.

27న ఐజీఎంసీలో రాష్ట్ర వాలీబాల్ జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల 27న ఉదయం 7 గంటలకు రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల, పురుషుల వాలీబాల్ జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ ఒక ప్రకటనలో తెలిపారు. శాప్ వీసీఎండీ ఆదేశాల మేరకు ఈ ఎంపికలను వాలీబాల్ కోర్టులో చేపడుతున్నామని, ఎంపికైన వారిని రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జనవరి 7 నుంచి 13 వరకు జరిగే సీనియర్ జాతీయ వాలీబాల్ క్రీడా పోటీలకు పంపుతామన్నారు. ఆధార్, నేటివిటీ సర్టిఫికెట్, 10 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఆ రోజు హాజరు కావాలని అజీజ్ తెలిపారు.

అఖిల భారత వర్సిటీ అథ్లెటిక్స్ ఎన్టీఆర్ అథ్లెట్లు

భువనేశ్వర్‌లోని కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో ఈ నెల 26 నుంచి 30 వరకు జరిగే ఆలిండియా ఇంటర్ వర్సిటీ పురుషుల, మహిళాల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ జట్లను ఎంపిక చేసినట్టు వర్సిటీ స్పోర్ట్సు బోర్డు సెక్రటరీ ఈ త్రిమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన టీమ్‌ను వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ డీవీఎస్ఎల్ నర్సింహం, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి అభినందించారు.

ఎంపికైన అథ్లెట్లు వీరే...

పురుషులు: బీ కిరణ్‌కుమార్, డీ చరణ్ నాయక్, ఏఎస్ శ్రీనివాస్, పీహెచ్ విష్ణు వర్ధన్, ఎం వెంకట రమణ, సీహెచ్ నియాజ్, ఆర్ రాకేష్‌కుమార్

మహిళలు: వీ ప్రమీల, ఎం ధనలక్ష్మి, కాజల్ సింగ్, టీ శ్రీ హర్ష, టీ గ్రేష్మ

రేషన్ డీలర్ల సంక్షేమనిధి

ఏర్పాటుకు సహకరించండి

- మంత్రి నాదెండ్ల మనోహర్‌కు రాష్ట్ర రేషన్ డీలర్స్ సంక్షేమ వేదిక



మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వేదిక నేతలు

మొగల్రాజపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న 29,786 మంది డీలర్లకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయడానికి సహకరించాలని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌కు రాష్ట్ర రేషన్ డీలర్స్ సంక్షేమ వేదిక అధ్యక్షుడు ఎం.శేషగిరిరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం విజయవాడలోని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో సంక్షేమ వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా గతంలో వలే కార్డుదారులకు ఇబ్బంది లేకుండా రేషన్ డిపోల ద్వారా సరకులు పంపిణీ చేయడానికి, పంపిణీ పూర్తయిన తరువాత ఎండీయూ ఆపరేటర్లు డీలర్లకు పూర్తిగా నగదు చెల్లించకుండా బకాయిలు పెడుతున్నారని అందువల్ల తదుపరి నెలలో సరుకులకు డీలర్లు డీడీలు కట్టడం ఇబ్బంది మారిందని, ఆథరైజేషన్ రెన్యూవల్స్ సచివాలయంలో ఆగిపోయాయని వాటిని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కేరళ ప్రభుత్వం ప్రభుత్వంపై భారం పడకుండా డీలర్ల భాగస్వామ్యంతో సంక్షేమ నిధి ఏర్పాటు చేసిందని ఆ విధానం మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని కోరారు.

మంత్రి సానుకూలంగా స్పందించారు. వేదిక ప్రధాన కార్యదర్శి టి.రవిచంద్రారెడ్డి, కోశాధికారి బంగార్రాజు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎం.ఇందిరా, కోశాధికారి పి.రాజేశ్వరి, రాష్ట్ర నేతలు, ఏ ఉదయేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, యు.వెంకటేశ్వరరావు, శివప్రసాద్, ప్రకాశరావు, పృథ్వీ పాల్గొన్నారు.

చివరి భూములకు నీరందించడమే లక్ష్యం : రాటకొండ

నందిగామ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెర్వుమాధవరం ట్యాంక్ నుండి సాగర్ కాలువలకు నీటి విడుదల పెంచాలని నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ కోరారు. సోమవారం ఆయన కాలువలపై పర్యటించారు. ఈసందర్భంగా ఆయన్ను కలసిన రైతులు ఆయకట్టులో మిర్చి, మొక్కజొన్న పంటలకు నీరందక ఎండిపోతున్నాయని చెప్పారు. దీనిపై స్పందించిన రాటకొండ అక్కడ నుండే ఎన్ఎస్‌పీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సీఎం ట్యాంక్ నుండి 450 క్యూసెక్కుల నీరు విడుదలౌతుందన్నారు. శనగపాడు-1, శనగపాడు-2 మేజర్ల పరిధిలోని ఆయకట్టు రైతులు ఎక్కువ నీరు వినియోగిస్తున్నందున దిగువకు నీరందించలేక పోతున్నట్టు చెప్పారు. దీనిపై స్పందించి రాటకొండ విషయాన్ని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆయకట్టు చివరి భూములకు నీరందించేందుకు కృషి చేస్తానని సౌమ్య భరోసా ఇచ్చారు.

నా కుమారుడు మృతిపై విచారణ జరిపించండి

- బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోండి
- తన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోండి
- బాధితురాలు వడ్డి నాగలక్ష్మి



మచిలీపట్నం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మపురం మునిసిపల్ పార్కు వద్ద గేటు విరిగి ఆడుకుంటున్న తన కుమారుడి ప్రాణం తీసిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపించి ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని వడ్డి నాగలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద కన్నీరు మున్నీరై మీడియాతో నాగలక్ష్మి మాట్లాడారు. తన ఏడేళ్ల కుమారుడు దినేష్‌కుమార్ మునిసిపల్ పార్కు వద్ద ఆడుకుంటుండగా గేటు విరిగి మీదపడిందని, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళిన వెంటనే మృతి చెందాడని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని చాలా కాలంగా అడుగుతున్నామని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తన భర్త లక్ష్మీకాంత్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, పేద కుటుంబానికి చెందిన తమను అధికారులు ఆదుకోవాలని నాగలక్ష్మి డిమాండ్ చేశారు.

దినేష్‌కుమార్ జవహర్ పబ్లిక్ స్కూల్‌లో ఎల్‌కేజీ చదువుతున్నాడన్నారు. నా పెద్దకుమారుడు విశాంత్ తమ్ముడిని కోల్పోయి దిగాలుపడ్డాడన్నారు. మానవతా దృక్పథంతో తన కుటుంబాన్ని ఆదుకోవాలని వలందపాలెంకు చెందిన నాగలక్ష్మి కోరారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	100, 109, 120
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.590

ఇళ్ల ముందు చెత్త వేస్తే జరిమానా

గుడివాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల ముందు చెత్తను వేస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ మల్లిఖార్జునరావుతో కలిసి 23, 24 వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. మున్సిపల్ సమావేశ మందిరంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఎన్విరాన్‌మెంట్)లతో సమీక్ష నిర్వహించారు. చెత్త సేకరణ, , వాహనాల రిపేర్లు, డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్‌లు, పారిశుధ్యం విషయాలపై ఆదేశాలిచ్చారు. ఆస్తి, నీటి పన్ను వసూళ్ల విషయంలో వార్డు కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అభిమానులకు అభివాదం చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

డిప్యూటీ సీఎం పవన్‌కు ఘన స్వాగతం

గుడివాడ/గుడివాడ రూరల్, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారి గుడివాడ నియోజకవర్గంలో పర్యటించిన పవన్‌కళ్యాణ్‌కు అపూర్వ స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఘనస్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో జిల్లా సమాచార శాఖ కనీసం మీడియా ప్రతినిధులకు మీడియా పాసులూ జారీ చేయలేదు. మీడియా ప్రతినిధులపై పోలీసులు ఆంక్షలు పెట్టారు. పాసులు ఉంటేనే లోపలికి అనుమస్తామన్నారు. కేవలం 100మందికి మాత్రమే అనుమతి అని చెప్పి 300మందికి పైగా కూటమి నాయకులను లోనికి అనుమతించారు. గుడివాడ నుండి పవన్‌కళ్యాణ్ కాన్వాయ్‌తో కలిసి జనసేన శ్రేణుల భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. పవన్ అభిమానులకు అభివాదం చేసుకుంటూ ర్యాలీగా మంగళగిరి తరలివెళ్లారు.



విజేతలైన ఇంజనీరింగ్ విద్యార్థులతో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్

క్రీడల్లో జీఈసీ విద్యార్థుల ప్రతిభ

గుడ్లవల్లేరు,డిసెంబరు, 23 (ఆంధ్రజ్యోతి) : అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల (జీఈసీ) విజయాలను సొంతం చేసుకుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ తెలిపారు. మహిళా వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించారన్నారు. కె.అనిత,జె.శ్రీవాణి యూనివర్శిటీ టీమ్‌కు ఎంపికైయ్యారని చెప్పారు. అంతర్ కళాశాలల ఖో ఖో పురుషుల విభాగంలో ప్రథమ స్థానం సాధించారన్నారు. టి.వెంకటేశ్వరరావు, ఎస్.కె.అబ్బాస్, యు.వెంకటేష యూనివర్శిటీ టీమ్‌కు ఎంపియ్యారన్నారు. విజేతలను ఫిజికల్ డైరెక్టర్లు ఎం.శివశంకర్, వెంకటేష్,పూజితలను కళాశాల యాజమాన్యం, వైస్ ప్రిన్సిపాల్స్ పి.కోదండరామారావు, ఎం.ఆర్.సిహెచ్ శాస్త్రి, యాజమాన్య సలహాదారు పి.రవీంద్రబాబు అభినందనలు తెలిపారు.



విజేతలైన ఎ.ఎ.ఎస్.ఎం.అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్
పాలిటెక్నిక్ విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ సత్తా

గుడ్లవల్లేరు,డిసెంబరు, 23 (ఆంధ్రజ్యోతి) : ప్రాంతీయ బాల బాలికల ఆటల పోటీల్లో గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ తెలిపారు. నందిగామ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో బాలికలలకు, విజయవాడ గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో బాలురకు వేర్వేరుగా నిర్వహించిన పోటీల్లో బాలికలు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఓవరాల్ చాపింయన్‌షిప్, బాలుర గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఓవరాల్ చాపింయన్‌షిప్ సాధించారన్నారు. బాలికల వ్యక్తిగత స్పోర్ట్స్ ఛాపింయన్ షిప్‌ను డి.వి.వర్షదుర్గ సాధించిందన్నారు. బాలుర వ్యక్తిగత స్పోర్ట్స్ చాంపియన్ షిప్‌ను భూక్యా జయ కుమార్ సాధించారన్నారు. విజేతలను, వారికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ వి.శ్రీనివాసరావు, సహాయ ఫిజికల్ డైరెక్టర్ ఎమ్.భవదీప్, మాథ్స్ సీనియర్ లెక్చరర్ ఎస్.ఫణికుమార్, మెకానికల్ బ్రాంచ్ జూనియర్ ఇన్‌స్ట్రక్టర్ కె.పిచ్చయ్య లను కళాశాల యాజమాన్యం, ఎగ్జిక్యూటివ్ మెంటార్ ఎన్.ఎస్.ఎస్.వి.రామాంజనేయులు, ప్రిన్సిపాల్ రాజశేఖర్ అభినందించారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలి

గుడివాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భారతరత్న, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని కేవీపీఎస్ నాయకులు వేశపోగు యేషయ్య డిమాండ్ చేశారు. బాహూజీనగర్‌లోని డా.అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. నాయకులు రాంబాబు, బొంతు వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు మెండా చంద్రపాల్, సిపిఎం నాయకులు ఆర్‌సిపి రెడ్డి, బిల్డింగ్ వర్కర్ యూనియన్ నాయకులు కొండ, రులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన చేస్తోన్న ఎస్సీ మోర్చా సభ్యులు

ఓటు బ్యాంకు రాజకీయాలను మానుకోవాలి

ఎస్సీ మోర్చా నిరసన

గుడివాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో మాట్లాడిన మాటలను వక్రీకరించారని, రాహుల్ గాంధీ ఓటు బ్యాంకు రాజకీయాలను మానుకోవాలని పట్టణ బీజేపీ అధ్యక్షుడు యర్రపోతు అర్జున్ అన్నారు. నాగవరప్పాడులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు దొండపాటి శివాజీ, పట్టణ అధ్యక్షులు దేవరపల్లి వెంకటేష్, నాయకులు కొత్త కిరణ్, శ్రీనివాసరావు, పోలాసి సాయి, రమేష్, వేమూరు యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.



కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, రావి



కురుమద్దాలి ఆర్‌సీఎం చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్‌రాజా



గుడ్లవల్లేరు శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో సెమీక్రిస్మస్ వేడుక

జనులందరికీ క్రీస్తు కృప

గుడివాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : క్రీస్తు దేవుని కృపతో ప్రజలందరూ సుభిక్షంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఆడిటోరియంలో ఎమ్మెల్యే వెనిగండ్ల ఆధ్వర్యంలో గ్రాండ్ సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సీఎస్‌ఐ సిస్టర్లు పాడిన కీర్తనలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన కేక్‌ను కట్ చేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

దైవసేవకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎన్‌టిఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, దైవసేవకులు కృపానందం, సిస్టర్ అంజలి, సాల్వేషన్ ఆర్మీ డీసీ బర్నబాస్, ఆర్‌సీఎం చర్చి పాదర్లు కరుణాకర్, అనిల్, విద్యాసాగర్, కరుణసాగర్, అబ్రహం శేఖర్, రత్నాకర్, విజయబాబు, కత్తి శారద, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెద ఎరుకుపాడులో

పేదల మధ్య సెమీక్రిస్మస్ వేడుకలను జరుపుకోవడం సంతోషకరంగా ఉందని హోలీక్రాస్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జెన్నీఫర్ అన్నారు. పెద ఎరుకపాడు ఎస్టీ కాలనీలో సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాల విద్యార్థులు, కాలనీపిల్లలు దేవుని పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. కాలనీలోని సుమారు 50 మంది సభ్యులకు భోజన వసతి కల్పించి నూతన వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

పామర్రు : ప్రభువు బోధనలను ఆచరించి ప్రతి ఒక్కరూ ప్రేమ స్వరూపులుగా మారాలని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా పిలుపునిచ్చారు. కురుమద్దాలి ఆర్‌సీఎం చర్చిలో నిర్వహించిన సెమి క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కుమార్‌రాజా, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్‌తో కలసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి చిన్నారులకు పంచారు. డీసీ ఛైర్మన్ కొసరాజు వేంకటేశ్వరరావు, పామర్రు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఎం ఫ్రాన్సిస్, గ్రామసర్పంచ్ గోట్రు విజయభారతి, మోజెస్, విదాస్ బాబు, మద్దాలి భార్గవి తదితరులు పాల్గొన్నారు. జమీగోల్వేపల్లి, రిమ్మనపూడి, అడ్డాడ చర్చి సెమీక్రిస్మస్ వేడుకల్లో కుమార్‌రాజా నరేష్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శాంతాక్రజ్ వేషధారణలతో నృత్య ప్రదర్శనలు చేశారు. కేక్‌ను పాఠశాల కరస్పాండెంట్ సింగంసెట్టి ఆదినారాయణ, పిల్లలతో కట్ చేయించారు.

యేసే జవాబు సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు

కూచిపూడి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : యేసే జవాబు సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధినేత, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు వేమూరి పరిశుద్ధ రాజు తెలిపారు.

మొవ్వ లైఫ్ గ్రౌండ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది హాస్టల్ విద్యార్థులతో పాటు పేద లు 300 మందికి బకెట్లు, విజయవాడ ప్రాంతంలో యాచకులు 300 మందికి వస్త్రాలు, ప్లాట్‌ఫారమ్‌పై జీవించే 150 మందికి రగ్గులు పంపిణీ చేసినట్లు తెలిపారు. 100 మంది అనాథ పిల్లలకు ఆదరణ కల్పిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలను మరింతగా విస్తృత పర్చనున్నట్లు పరిశుద్ధ రాజు తెలిపారు. సంస్థ సహాయ అధ్యక్షురాలు అమ్మిని పాల్గొన్నారు.



కిశోర వికాసం కార్యక్రమంపై
శిక్షణ కార్యక్రమంలో సీడీపీవో భానుశ్రీ

కిశోర బాలికల్లో ఆత్మగౌరవం పెంచాలి

పమిడిముక్కల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలను సంరక్షించి వారిలో ఆత్మగౌరవం పెంచాలని ఐసీడీఎస్ సీడీపీవో భానుశ్రీ అన్నారు. పమిడిముక్కల మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో భానుశ్రీ మాట్లాడుతూ కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆహారం, వారికి వివాహ వయస్సు, విద్య ప్రాముఖ్యత, లింగ వివక్షత వంటి వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎండీవో, ఏఎన్ఎం, అంగన్‌వాడీ సూపర్ వైజర్స్, టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.



భవానీలకు పండ్లు పంపిణీ

గుడివాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బంటుమిల్లి రోడ్డులోని దుర్గశ్యామల స్వీట్ షాపు వద్ద సోమవారం గోదావరి జిల్లాల నుండి కాలినడకన విజయవాడ వెళ్తున్న 300 మంది భవానీలకు శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్ సహకారంతో స్వీట్లు, పండ్లు, కూల్‌డ్రింక్‌లను అందజేశారు. స్థానిక శ్రీవీరాంజనేయస్వామి వారి దేవస్థాన ప్రధాన అర్చకులు యడవల్లి విజయకుమార్ భవానీలకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ వేణుబాబు, పట్టపు చిన్నా, బాలకృష్ణ, కేసంశెట్టి అజయ్‌కుమార్, వి.శ్రీను, కంతేటి హరిబాబు, జొన్నలగడ్డ రమేష్‌బాబు, ఏలూరి వీరయ్య, తాతారావు పాల్గొన్నారు.



స్వీపర్లకు దుస్తులు పంపిణీ

కూచిపూడి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోసూరు గ్రామ పంచాయతీలోని పలువురు స్వీపర్లకు, సంపద తయారీ షెడ్డులో పని చేసే కార్మికులకు ఒక్కొక్కరికి రెండు జతల దుస్తులను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. గ్రామసర్పంచ్ పెనుమూడి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రేడ్-1 కార్యదర్శి ఎం.ఎస్.ఎన్.మూర్తి, లుక్కా శివనాగులు, వెంకటేశ్వరరావు, కృష్ణ, పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు తీసుకుంటున్న తహశీల్దార్ వై.రంగారావు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

పెదపారుపూడి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ వై.రంగారావు అన్నారు. వింజనంపాడు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట రెవెన్యూ సభ జరిగింది. ఈ సభకు తహసీల్దార్ వై.రంగారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామస్థులు నుంచి వివిధ సమస్యలకు సంబంధించి అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు. రీ సర్వే డీటీ సుందరరావు, పాల్గొన్నారు.



రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఏఎన్నార్‌లో జాతీయ గణిత దినోత్సవం

గుడివాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏఎన్నార్ కళాశాల పీజీ సెమినార్ హాల్‌లో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత రామానుజన్ చిత్రపటానికి నివాళ్ళులర్పించారు. రామానుజన్ జీవిత చరిత్ర, గణిత విభాగంలో ఉన్న ఉద్యోగ అవకాశాల ను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.జె.ఎస్ కుమార్, గణిత విభాగాధిపతి కె.రమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకవులకు కవితల పోటీ

గుడివాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం, సంక్రాంతి, పర్వదినాలను పురస్కరించుకుని పట్టణ, పరిసర ప్రాంతాల్లోని యువ కవులకు కవితల పోటీని నిర్వహిస్తున్నట్లు సాహితీ మిత్రుల సంస్థ కన్వీనర్ వసుధ బసవేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 సంవత్సరాల వయస్సులోపు యువతీయువకులు, పాఠశాల, కళాశాల విద్యార్థులు కవితలు రాసి సెల్ నెం.9490832787కు వాట్సాప్ ద్వారా లేదా సాహితీ మిత్రులు, డోర్ నెం.4/96, లక్ష్మీనగర్‌కాలనీ, గుడివాడకు పోస్ట్ ద్వారా 2025 జనవరి 10వ తేదీ లోపు పోస్టు ద్వారా పంపాలని కోరారు. విజేతలకు జనవరి 17వ తేదీన బహుమతి ప్రదానం జరుగుతుందని వసుధ తెలిపారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలి

గుడివాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గుడివాడలోని టిడ్కో గృహాలను లబ్దిదారులను అప్పగించాలని, ఎనిమిదేళ్లు గడిచినా పేదవాడి సొంతింటి కల నెరవేరలేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు వద్దాది రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్దిదారుని వాటాగా రూ.50వేలు కట్టి ఏళ్ళు గడుస్తున్న అధికారులు గృహాలను అప్పగించకపోవడం దారుణమన్నారు. బ్యాంకర్లు రుణాలిచ్చి తాళాలు అప్పగించకుండా మున్సిపల్ అధికారులు రిజిస్ట్రేషన్ చేయడానికి నిరాకరిస్తున్నారని ఆరోపించారు. మిగిలి ఉన్న లబ్దిదారులకు గృహాలను వెంటనే అప్పగించాలని వద్దాది డిమాండ్ చేశారు.

బాలికా వికాసంపై మండల స్థాయి శిక్షణ

తోట్లవల్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కిశోర వికాసంపై మండలస్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి సాయిప్రసన్న, గుడివాడ డివైఈవో ఐ పద్మారాణి, ఐసిడిఎస్ సడీడీపీవో భానుశ్రీ, ఎంపీడీవో రవికాంత్, తహసీల్దార్ ఎం కుసుమకుమారి, ఎంఈవో జి వెంకటేశ్వరరావు కిశోర బాలికలకు విద్య అవసరం, వ్యక్తిగత ఆరోగ్యం, బాల్య వివాహాలను అరికట్టటం, ఆత్మరక్షణ నైపుణ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలికలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు జె సుజాత, కె నాగమల్లేశ్వరి, వెలుగు ఏపీఎం సాంబశివరావు, ఎల్‌సిపివో వి శైలజ, జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ సచివాలయాల ఎఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించాలి

తోట్లవల్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ హక్కులతో తమ ఆధీనంలో ఉన్న జమిందారి భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు పొందలేకపోతున్నామని పాములలంక రైతులు వాపోయారు. పాములలంక పంచాయితీ కార్యాలయం వద్ద సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. జమిందారి భూములను తమ పూర్వీకులు కొనుగోలు చేశారని, అందుకు సంబంధించిన పత్రాలన్నీ ఉన్నాయమని, తమ చేతిలో ఉండి పంటలు పండించుకుంటున్న వ్యవసాయ భూములకు ఇంత వరకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వలేదని, తమ పేర్లు ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలని తహసీల్దార్ ఎం కుసుమకుమారికి రైతులు వినతి పత్రాలు అందించారు. పాములలంక శివారు తుమ్మలపచ్చికలంక, దాని పరిధిలో ఉన్న లంక భూములు సర్వే నెంబరు 444లో ఉన్నాయని, అయితే 444 సర్వే నెంబరు వల్లూరుపాలెం రెవెన్యూ పరిధిలో చేర్చటంతో తమ పంచాయితీకి ఆదాయ వనరులు లేకుండా పోయయని మాజీ సర్పంచ్ పాముల శ్రీనివాసరావు సదస్సులో తెలిపారు. 444 సర్వే నెంబరుని పాములలంక పంచాయితీ కిందకు తీసుకు రావాలని కోరారు. దీనికి రాష్ట్ర గౌడ కార్పోరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి స్పందించి పాములలంక సమస్యలను రెవెన్యూశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, వీఆర్వో పి నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగవరంలో రైతుల నుంచి పది అర్జీలు

గుడివాడ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): లింగంవరం గ్రామంలో రైతులు పది మంది రెవెన్యూ సమస్యలపై అర్జీలు అందించారని తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు తెలిపారు. సోమవారం లింగవరంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి అర్జీలు స్వీకరించారు. ఆరు దరఖాస్తులు టైటిల్ డీడ్, పట్టాదారు పాసుపుస్తకాల కోసం, ఒకరు ఆదాయ ధృవీకరణ పత్రం కోసం, ఇద్దరు కుల ధ్రువీకరణ పత్రం కోసం, ఇద్దరు ఎఫ్ లైన్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సమస్యలు పరిష్కరించటానికి కృషి చేస్తామన్నారు. ఆర్ఐ నాగబాబు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నందివాడలో ..

నందివాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదవిరివాడలో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. పాస్ బుక్‌లు కావాలంటే డబ్బులు ఇస్తేనే పనులు చేస్తామని అధికారులు నిక్కచ్చిగా చెబుతున్నారని రైతులు తహసీల్దార్ వద్ద తమ గోడు వెలిబుచ్చారు. రెవెన్యూ సదస్సుల ద్వారా తమ సమస్యలను పరిష్కరించాలంటూ తహసీల్దార్ గురుమూర్తిరెడ్డికి రైతులు వినతిపత్రాలు అందజేశారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

పామర్రు ,డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాసుత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తూ ప్రజల మన్నలను వైద్యులు పొందాలని పామర్రు ఎంపీపీ దాసరిఅశోక్‌కుమార్ అన్నారు. నిమ్మకూరు ప్రాదమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగితెలుసుకున్నారు. సమస్యలపై అశోక్ చర్చించారు. తీర్మానాలు ఆమోదించారు. పీహెచ్‌సీ వైద్యులు రఘురామ్,యశ్వంత్, చరణ్, ఝూన్సీ, ఆరోగ్యసిబ్బందిపాల్గొన్నారు.





ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి గెలుపునకు కృషి : అశోక్‌బాబు

అవనిగడ్డ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు కోసం కృషి చేయాలని ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన నియోజకవర్గ పట్టభద్రులకు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను పరిచయం చేసే కార్యక్రమం జరిగింది. మాజీ ఎమ్మెల్సీ డా.ఎ.ఎస్.రామకృష్ణ, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, మండలి వెంకట్రామ్, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, మండవ బాలవర్ధిరావు, కొల్లూరి వెంకటేశ్వరరావు, తుంగల వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో జేసీ గీతాంజలి శర్మ, పాస్టర్ ఐపీసీ కరుణకుమార్



పుల్లపాడులో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



ఎస్‌వీఎల్ కళాశాలలో కేక్ కట్ చేస్తున్న దుట్టా ఉమా



అవనిగడ్డ మండల కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ సుమతీదేవి

ఏసుక్రీస్తు ప్రేమ, త్యాగం స్ఫూర్తిదాయకం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏసుక్రీస్తు బోధించిన ప్రేమ, త్యాగం అందరికీ స్ఫూర్తి దాయకమని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జిల్లా మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సెమీ క్రిస్మస్ నిర్వహించారు. గీతాంజలి శర్మ, పాస్టర్ ఐపీసీ కరుణకుమార్ కేకు కట్ చేశారు. గీతాంజలి శర్మ మాట్లాడుతూ, క్రైస్తవ సోదరులందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. క్రిస్మ స్ శుభాకాంక్షలు తెలిపారు. బెరాకా మినిస్ట్రీస్ అధినేత డాక్టర్ కిరణ్‌పాల్, అప్పికట్ల జాషువా, సురేష్, సుదర్శన్, మోజెస్, సుకుమార్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి అబ్దుల్ రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

డీఈవో కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బెరాకా మినిస్ట్రీస్ అధినేత డా. కిరణ్‌పాల్ ముఖ్య అతిథిగా పాల్గొని సందేశమిచ్చారు. విద్యార్థుల నృత్యం అందరినీ ఆకర్షించింది. నందం రామారావు, దైవ వర్తమానికులు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పుల్లపాడులో ఎమ్మెల్యే కాగిత..

పెడన రూరల్ : క్రిస్మస్ పండుగ అందరికీ ఆనందాన్ని పంచాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నా రు. పెదపుల్లపాడు, లంకలకలవగుంట (బోడగుంట)లో క్రిస్మస్ సంతోషం పేరుతో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, పడమట ఘంటయ్య, కట్టా సూర్యచంద్రరావు, శ్యామసుందరరావు, మధు, సతీష్ పాల్గొన్నారు.

ఎస్‌వీఎల్ కళాశాలలో

అవనిగడ్డ : ఎస్‌వీఎల్ కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పాస్టర్ జోయల్ రాజారావు క్రీస్తు జనన సందేశానిచ్చారు. కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచారు. ప్రిన్సిపాల్స్ నాగేశ్వరరావు, రాజేంద్ర ప్రసాద్‌లు పాల్గొన్నారు.

అవనిగడ్డ రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మరియ కుమారి అధ్యక్షతన సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ తుంగల సుమతిదేవి సందేశమిచ్చారు. క్రిస్మస్ కేక్‌ను ఎంపీపీ, ఎంపీడీవో కట్ చేశారు. సర్పం చ్ గొరుముచ్చు ఉమా, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, పంచాయతీల కార్యదర్శులు, ఎంఈవో ఎన్.శివశంకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎదురుమొండిలో

నాగాయలంక : ఎదురుమొండి దీవుల అభివృద్ధికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విస్తృత కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ అన్నారు. ఎదురుమొండిలో ఆల్‌మైటీ గాడ్ మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకట్రామ్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. రెవరెండ్ కె.జాన్ చక్రవర్తి, మెండు లక్ష్మణరావు, బాబురావు, రెవరెండ్ ఎం.బుజ్జిబాబు పాల్గొన్నారు.



ఎదురుమొండి సెమీ క్రిస్మస్ వేడుకల్లో మండలి వెంకట్రామ్‌ను సత్కరిస్తున్న దైవసేవకులు

చర్చికి విక్కుర్తి విరాళం

అవనిగడ్డ : నాగాయలంక 12వ వార్డులోని పురాతన సీబీఎం చర్చి పునర్నిర్మాణానికి విక్కు ర్తి వీరరాఘవయ్య ట్రస్ట్ అధ్యక్షులు విక్కుర్తి శ్రీనివాస్ రూ.25 వేల ఆర్థిక సాయమందించారు. బందెల నాగబాబు, సోమేశ్వరరావు విజ్ఞప్తి మేరకు స్పందించిన విరాళం అందజేశారు. కొల్లూరి జీవన్ రాజు, బందెల శశిరేఖ, వీర రాఘవమ్మ, రత్నం, శీలి వాణి, నాగమణి, చిన్నమ్మాయి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

దివి పునర్నిర్మాణంలో క్రైస్తవ మిషనరీల పాత్ర ఎనలేనిది

చల్లపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉప్పెన అనంతరం దివిసీమ పునర్నిర్మాణంలో క్రైస్తవ మిషనరీల పాత్ర ఎనలేనిదని టీడీపీ నేత, ఎన్నారై బొబ్బా గోవర్ధన్ అన్నారు. మేకావారిపా లెం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన సెమీక్రిస్మస్ వేడుకల్లో గోవర్ధన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రైస్తవ సంఘాలు దివిసీమ ఉప్పెన నాటి సంఘాలను స్ఫూర్తిగా తీసుకుని తమ పరిధిలోని గ్రామాల్లో చదువు ఆవశ్యకతను వివరించాలన్నారు. పాస్టర్ అల్లంశెట్టి ఇర్మియా సంఘ విశ్వాసులకు భక్తిమార్గంతో పాటు నైతిక విలువలు, చదువు ఆవశ్యకతను వివరిస్తూ పిల్లల భవితకు బాటలు వేయటం అభినందనీయమన్నారు. స్కూల్ పిల్లలకు బహుమతులు, సంఘ సేవకులకు నూతన దుస్తులు అందచేశారు. టీడీపీ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు, విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు, మేడికొండ విజయ్, బుల్లా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



బొబ్బా గోవర్ధన్‌కు కేక్ తినిపిస్తున్న శ్రీనివాసరావు

తగిన గుర్తింపు లేనప్పుడు మేము ఉండలేం

● సమన్వయ కమిటీ సమావేశంలో టీడీపీ నాయకుల ఆగ్రహం

అవనిగడ్డ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో పార్టీ కోసం పని చేస్తున్న తాము అసలు అధికార పార్టీలో ఉన్నామా? లేక ప్రతిపక్షంలో ఉన్నామో అర్థం కావటం లేదని పలువురు టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పార్టీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆరు మండలాల టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ తరఫున ఎవరిని అభ్యర్థిగా నిలపాలన్న విషయాన్ని కూడా జనసేన పార్టీ వారే నిర్ణయించే పరిస్థితి ఉండటం దురదృష్టకరమన్నారు. తమకు కనీస గుర్తింపు లభించటం లేదని, తమ మాట కింది స్థాయి ఉద్యోగి సైతం వినని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి మోపిదేవి మండలంలో పని చేస్తున్న తమకు గానీ, తమ నేతలకు గానీ కనీస గుర్తింపు లేదని సమన్వయ కమిటీ సమావేశంలో మోపిదేవి మండల కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీడీసీ మాజీ ఛైర్మన్, సీనియర్ నేత రావి నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పార్టీలోని తన పదవికి, ఎంపీపీ పదవికి తన భార్య వెంటనే రాజీనామా చేసి సాధారణ కార్యకర్తలుగా పని చేస్తామంటూ సమావేశం నుంచి లేచి వెళ్లిపోయారు. నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ, మోపిదేవి మండలాల నేతలు సైతం నియోజకవర్గంలో తమకు ఎలాంటి ప్రాధాన్యత లభించటం లేదని వాపోయారు. నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలు దురదృష్టకరమన్నారు. నియోజవర్గంలోని పరిస్థితుల గురించి పార్టీ అధిష్ఠానానికి నివేదిస్తానని, పార్టీ నేతలకు తగిన గౌరవం లభించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పార్టీ ముఖ్య నేతలు బొబ్బా గోవర్ధన్, యాసం చిట్టిబాబు, బండే శ్రీనివాసరావు, మండవ బాలవర్ధిరావు, మెండు లక్ష్మణరావు, తుమ్మల చౌదరిబాబు, మోర్ల రాంబాబు, పైడిపాముల కృష్ణకుమారి, నిడమానూరి దిలీప్‌కుమార్, యార్లగడ్డ శ్రీనివాసరావు, షేక్ నబీ ఘోరిలతో పాటు ఆరు మండలాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు. సీడీసీ మాజీ ఛైర్మన్ రావి నాగేశ్వరరావు వెళ్లిపోయి మోపిదేవిలో పార్టీ నేతలతో సమావేశం కావటంతో వెంటనే కనపర్తి బుజ్జగింపు చర్యలను ప్రారంభించారు.



వైభవంగా పైడమ్మ తెప్పోత్సవం

పెడన, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పైడమ్మ తల్లి జాతర ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి అమ్మవారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారు మూడు సార్లు చెరువులో జలవిహారం చేశారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఆలయ ఈవో టి.వి.వి. మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావు, ఉత్సవ కమిటీ సభ్యులు బొడ్డు ఆనందరావు, పత్తిపాటి జయకృష్ణ, కోమట్ల సాంబశివరావు, మల్లంపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పైడమ్మతల్లిని సోమవారం మునిసిపల్ ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి, ఆమె భర్త, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఈవో టివివి మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు.

ఘంటసాలపాలెన్ని రెవెన్యూ గ్రామం చేయాలి

ఘంటసాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాలపాలెంను రెవెన్యూ గ్రామంగా విభజన చేయాలని గ్రామసర్పంచ్ దోనె రజని సోమవారం తహసీల్దార్ విజయ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఘంటసాల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తహసీల్దార్ అధ్యక్షతన సోమవారం రెవెన్యూ సదస్సు జరిగింది. రజని మాట్లాడుతూ, ఘంటసాల పాలెం గ్రామపంచాయతీకి సరైన ఆర్థిక వనరులు లేకపోవటం, గ్రామపంచాయతీ పరిధి ఎక్కువగా ఉండటం వల్ల అభివృద్ధి పూర్తిస్థాయిలో జరపలేకపోతున్నామన్నారు.



రాజనీతిజ్ఞుడు పీవీ : మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగు జాతి గర్వించదగిన రాజనీతిజ్ఞుడు మాజీ ప్రధాని పివి నరసింహారావు అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పీవీ నరసింహారావు 20వ వర్థంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరసింహారావు జీవిత విశేషాలను బావితరాలకు తెలియచేసే లా కృషి చేస్తున్న బ్రాహ్మణ సంఘ నాయకుడు పి.వి. ఫణికుమార్ కృషి అభినందనీయమన్నారు. గడ్డం రాజు, శ్రీరామచంద్రమూర్తి, హరికృష్ణ, గోపీచంద్, బాబాప్రసాద్, ఇలియాస్ పాషా, సమతాకీర్తి, నీరజ, సుశీల, ఉమాదేవి, నారాయణ ప్రసాద్, బ్రాహ్మణ సంఘ నాయకులు పి.ఎస్.ఎస్.ఆర్. శర్మ, శివరాం, మోపర్తి సుబ్రహ్మణ్యం, కాశీపట్నపు రఘు, ఫణి కిరణ్‌శర్మ, తిరుమలరావు పాల్గొన్నారు.



నందమూరు పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

పెడన రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : శరీరక ధారుడ్యంతో పాటు మేధస్సు పెంపునకు క్రీడలు దోహదం చేస్తాయని నందమూరు పాలిటెక్నిక్ కళాశాల ఛైర్మన్ గుడవాడ ప్రసాద్ అన్నారు. అంతర్ కళాశాల పాలిటెక్నిక్ ఆటల పోటీల్లో నందమూరు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభన చాటారు. . డిస్కస్ త్రోలో ఎ శిరీష స్వర్ణం, డి యశ్వంతి రజితం, షాట్‌పుట్‌లో వి.తేజాప్రవల్లిక రజితం, డి.యశ్వంతి కాంస్యం, రన్నింగ్‌లో బోనిక, గాయత్రి, రేఖ, నీలిమ పతకాలు సాధించారు. ఛైర్మన్ గుడివాడ ప్రసాద్, కార్యదర్శి తాడేపల్లి మెహర్‌బాబా, కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, ప్రిన్సిపల్ ప్రసాద్, దోసపాటి బాబా, తమ్మన సాయి, ఫిజికల్ డైరక్టర్‌లు రమేష్, రామకృష్ణ విద్యార్థులను అభినందించారు.



రైతులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రముఖులు

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రైతులకు సన్మానం

చల్లపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేశానికి వెన్నుముక రైతులనీ, జాతీయ రైతుదినోత్సవం సందర్భంగా రైతులను సన్మానించడం అభినందనీయమని రైతుసంఘం నేతలు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, యద్ధనపూడి మధులు అన్నారు. చల్లపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పది మంది రైతులను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. పెద్ద టార్చిలైటులను అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రాయపాటి రాధాకృష్ణ, కార్యదర్శి కస్తూరి ప్రసాద్, కోశాధికారి ముమ్మనేని నాని, నర్రా సాయిబాబు, టి.సాంబశివరావు, హరిగోపాల్, దోనేపూడి గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. రైతులు గోళ్ల పూర్ణమల్లిఖార్జునరావు, అంబటి దుర్గారావు, వీరంకి సాంబశివరావు, తాతా నాగబాబు, డొక్కు వెంకటేశ్వరరావు, యన్నం వెంకటేశ్వరరావు, బొందలపాటి సురేష్, వేమూరి శ్రీధర్, బొందలపాటి వెంకటేశ్వరరావు, ఆదిశేషులను ఘనంగా సన్మానించారు. డాక్టర్ ఏవిఎల్.నారాయణరావు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. రైతుదినోత్సవాన్ని రామానగరం శ్రీచైతన్య స్కూల్‌లో నిర్వహించారు. రైతులు అద్దంకి రామాంజనేయులు, గువ్వాబత్తిన బాలకృష్ణ, గరికిపాటి శ్రీనివాసరావులను సన్మానించారు. ప్రిన్సిపాల్ డి.సురేష్, సోనియాభాయి, ఎస్తేరురాణి, రమ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బొలేరో.. నిలిచిన ట్రాఫిక్

అవనిగడ్డ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పులిగడ్డ జంక్షన్ వద్ద సోమవారం ఉదయం చేపల లోడుతో వెళ్తున్న బొలేరో వాహనం ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనటంతో దాదాపు కిలో మీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. లారీ, బొలేరో డ్రైవర్లు ఇరువురు రాజీ పడగా, ఎస్సైన శ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

బంటుమిల్లి పీఏసీఎస్ స్థలంలో కేడీసీసీ భవనం నిర్మాణానికి అనుమతివ్వాలి

బంటుమిల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి పీఏసీఎస్‌కు చెందిన ఖాళీ స్థలంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బంటుమిల్లి బ్రాంచ్ భవన నిర్మాణం చేపట్టాలని కోరుతూ డీసీ ఛైర్మన్ కాశీ సోమ వారం జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకు అర్జీ ఇచ్చారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచనల మేరకు బంటుమిల్లి డీసీ బొర్రా కాశీ, బంటుమిల్లి కేడిసీసీ బ్యాంకు మేనేజర్ నాగలక్ష్మీ బంటుమిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తీర్మానం కాపీని అందజేశారు. పది సెంట్ల స్థలంలో కేడిసీసీ బ్యాంకు సొంత భవన నిర్మాణంతో పాటూ మిగిలిన 20 సెంట్లలో బంటుమిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం గొడౌన్, ఇతర నిర్మాణాలు బ్యాంకు సూపర్‌వైజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

గూడూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ సంగా మధుసూధనరావు అధ్యక్షతన జరిగింది. అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ అంశాలపై విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. వైస్ ఎంపీపీ పిచ్చుక గంగాధరరావు, డీసీ ఛైర్మన్ పోతన స్వామి, ఇన్‌చార్జి ఎంపీడీవో బి. రాజేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ సాయి, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



కోడూరు - మచిలీపట్నం బస్సు ప్రారంభం

కోడూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉల్లిపాలెం, చిన్నాపురం మీదుగా కోడూరు నుంచి మచిలీపట్నానికి నూతనంగా ఏర్పాటు చేసిన బస్సు సర్వీసును మండల జనసేన పార్టీ నాయకులు సోమవారం ప్రారంభించారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉదయం గం.7.30, లకు సాయంత్రం గం.6.30 లకు కోడూరు నుంచి బయలుదేరి మచిలీపట్నం వెళ్తుందన్నారు. దేవనబోయిన వెంకటేశ్వరరావు, మర్రే గంగయ్య, కొండవీటి సునీత, కోట రాంబాబు, జరుగు పోతురాజు, పూతబోయిన సీతారత్న సాయిబాబు, కాగిత రామారావు, కడవకొల్లు శ్రీనివాసరావు, కొల్లి వెంకటేశ్వరరావు, పూతబోయకిన లక్ష్మణ, పూతబోయిన కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.